RNI No. TEL/TEL/2018/76342

# లోకంతీరు

LOKAMTEERU TELUGU DAILY సామాజిక, రాజకీయ దిన పత్రిక

ప్రచురణ : నిజామాబాద్ గురువారం 04-07-2024 ఎడిటర్ : బ్యాగల్ శ్రీనివాస్ సంపుటి : 06 సంచిక : 173 పేజీలు : 4 వెల : రూ 2-00




## రైలు ఢీకొని వృద్ధుడు దుర్మరణం

మేడ్చల్,రైలు పట్టాలు దాటుతున్న ఓ వృద్ధుడిని రైలు ఢీకొట్టి, మృతదేహంతో వేలాడుకుంటూ ఘట్కేసర్ రైల్వే స్టేషన్ వరకు తీసుకువచ్చింది. రైల్ కింద వ్యక్తి రైల్ కి వెలాడుకుంటూ ఘట్ కేసర్ రైల్వే స్టేషన్ కి వచ్చిన ఘటన అక్కడ చూసే వారిని కన్నీటిని తెప్పించింది. బీబీనగర్-ఘటికేసర్ రైల్వేస్టేషన్ మద్య ఓ గుర్తుతెలియని వృద్ధుడు రైలు పట్టాలు దాటుతుండగా వరంగల్ వైపు నుంచి వస్తున్న రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వృద్ధుడు రైలు ముందుబాగాని కి చిక్కుకొని ఐదు కిలోమీటర్ల మేరకు రైలు లాక్కోంచ్చింది. గమనించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించడంతో ఘటికేసర్ రైల్వేస్టేషన్ సమీపంలో రైలును ఆపి వృద్దుని వెలికి తీశారు. నీలంరంగు చౌక్కా, ఆరేంజ్ రంగు లుంగీ, కుడిచేతికి కడెం ఉన్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

# రాజ్యసభలో ఇండియా కూటమి పార్టీల వాకౌట్



న్యూఢిల్లీ : బుధవారం రాజ్యసభలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగిస్తుండగా జోక్యానికి ప్రతిపక్ష నాయకుడు (ఎల్ఒపి) మల్లికార్జున్ ఖర్గేకు అనుమతి లభించకపోవడంతో కాంగ్రెస్ నాయకత్వంలో ఇండియా కూటమి పార్టీలు సభలో నుంచి వాకౌట్ చేశాయి. పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్రపతి చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు ప్రధాని మోడీ సమాధానం ఇస్తుండగా ఎల్ఒపి ఖర్గే జోక్యం చేసుకోవాలని అనుకున్నారు. కానీ ఖర్గే విజ్ఞప్తులను చైర్మన్ జగ్దీప్ ధన్ఖర్ తిరస్కరించారు. దీనితో ఇండియా కూటమి ఎంపిలు నినాదాలు చేస్తూ, ఎల్ఒపి ఖర్గేని మాట్లాడనివ్వాలని కోరారు. వారి నినాదాల మధ్య మోడీ తన ప్రసంగం కొనసాగించారు. ఇది కొంత సేపు కొనసాగింది. తనను మాట్లాడనివ్వాలని ఖర్గే పదే పదే అభ్యర్థించారు.ఖర్గేకు ఎట్టకేలకు అనుమతి లభించినప్పుడు ఇండియా కూటమి ఎంపిలు సభలో నుంచి వాకౌట్ చేశారు.

**ప్రధాని మోడీ ప్రసంగం మధ్యలో వారి నిరసన**
**మోడీ మాట్లాడుతుండగా ప్రతిపక్షాల నినాదాల హోరు**
**వాకౌట్‌ను నిరసించిన సభ చైర్మన్ ధన్ఖర్**
**రాజ్యసభ నిరవధిక వాయిదా**

వారి వాకౌట్‌ను ధన్ఖర్ ఖండించారు. అది రాజ్యాంగానికి అవమానకరం అని ఆయన అన్నారు. మోడీ కూడా వారి వాకౌట్‌ను గర్హించారు. తాను స్వప్రయోజనం కోసం ప్రయత్నించడం లేదని, కానీ తన ప్రభుత్వ పని తీరును వివరించడం తన కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాల తీర్మానాన్ని రాజ్యసభ ఆమోదించిన అనంతరం సభ నిరవధికంగా వాయిదా పడింది. జూన్ 27న మొదలైన రాజ్యసభ 264వ సెషన్ ధన్యవాదాల తీర్మానానికి ప్రధాని మోడీ సమాధానం ఇచ్చిన తరువాత తీర్మానాన్ని ఆమోదించిన పిమ్మట సభ వాయిదా పడింది. లోక్‌సభను మంగళవారం నిరవధికంగా వాయిదా వేసిన విషయం విదితమే.

ప్రతిపక్షం వాకౌట్ 'ప్రమాదకర సంప్రదాయం': ధన్ఖర్

ప్రధాని మోడీ సమాధానం ఇస్తున్న సమయంలో వాకౌట్ చేయడం ద్వారా ప్రతిపక్షం 'ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమైన ప్రమాదకర సంప్రదాయాన్ని' నెలకొల్పిందని రాజ్యసభ చైర్మన్ జగ్దీప్ ధన్ఖర్ బుధవారం విమర్శించారు. సభను నిరవధికంగా వాయిదా వేసే ముందు ధన్ఖర్ ముగింపు ఉపన్యాసం ఇస్తూ, సెషన్ సమయంలో సభాధ్యక్షుని వేదిక ముందుకు ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే రావడం 'పార్లమెంటరీ ప్రవర్తనకు, ఔచిత్యానికి అవమానకరం' అని కూడా ధన్ఖర్ వ్యాఖ్యానించారు. సెషన్ కార్యక్రమాలపై చైర్మన్ వివర ణ ఇస్తూ, అధికార పక్షం, ప్రతిపక్షం నుంచి సభ్యులు చురుకుగా పాల్గొనగా, కొన్ని వ్యాఖ్యలు 'కార్యకలాపాలను దెబ్బ తీసిన అంతరాయాలు నన్ను బాగా కలచివేశాయి' అని చెప్పారు. 'అనుభవజ్ఞులైన సభ్యులు బాధ్యతారహితంగా ప్రవర్తించడం ముఖ్యంగా బాధాకరం. అంతరాయం ముందు పేర్కొన్న కార్యకలాపాలను అడ్డుకోవడమే కాకుండా ఈ ప్రసిద్ధ వ్యవస్థ ప్రతిష్ఠను కూడా దెబ్బ తీస్తుంది' అని ఆయన స్పష్టం చేశారు. ఖర్గే శుక్రవారం రాజ్యసభ వెల్‌లోకి ప్రవేశించడాన్ని ధన్ఖర్ ప్రస్తావిస్తూ, 'తుదకు ప్రతిపక్ష నాయకుడు కూడా సభ వెల్‌లోకి రావడం ఎంతైనా బాధాకరం. అది పార్లమెంటరీ ప్రవర్తనకు, ఔచిత్యానికి అవమానకరం' అని పేర్కొన్నారు. 'ఈ సభ సమాలోచనలు, చర్చలు, సంభాషణల ఆలయం కావడానికి వీలుగా సభ్యులు తమ ప్రవర్తనను చూపాలి' అని ఆయన కోరారు. 'ఇప్పుడు వారి వాకౌట్ తీవ్ర బాధాకరం, ఇది చారిత్రక సందర్భం. ప్రభుత్వం మూడవ టెర్మ్‌లో ఉంది. ప్రధాని ఆరు దశాబ్దాల తరువాత ప్రభుత్వానికి వరుసగా సారథ్యం వహిస్తున్నారు. వారు తమ రాజ్యాంగ బాధ్యతల నుంచి వాకౌట్ చేశారు. అది ప్రజాస్వామిక విలువలకు విరుద్ధమైన ప్రమాదకర సంప్రదాయాన్ని నెలకొల్పింది'

## మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ : మోదీ



న్యూఢిల్లీ: రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం రాజ్యసభలో బదులిచ్చారు. విపక్షాల నిరసనల మధ్య ప్రధాని తన ప్రసంగం కొనసాగించారు. రాబోయే ఐదేండ్లలో పేదరికంపై పోరాటంలో విజయం సాధిస్తామని చెప్పారు. గత పదేండ్ల అనుభవాలతో తాను ఈ మాట చెబుతున్నానని అన్నారు. ఈ ఐదేండ్లలో మరిన్ని కీలక నిర్ణయాలు ఉంటాయని అన్నారు.భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే నాటికి ఆ ప్రభావం అన్ని రంగాలపై ఉంటుందని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా కాంగ్రెస్ తీరు మారలేదని ఎద్దేవా చేశారు. 140 కోట్ల మంది ప్రజలను విపక్షాలు అవమానిస్తున్నాయని వ్యాఖ్యానించారు. రాజ్యాంగం వల్లే తనలాంటి వారు పార్లమెంట్ వరకూ రాగలిగారని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో రూ. 60000 కోట్ల వరకూ రైతుల రుణాలు మాఫీ చేసినా లబ్ధిదారుల జాబితాలో చిన్న, సన్నకారు రైతుల పేర్లు చేర్చలేదని ఆరోపించారు.రాజ్యసభలో ప్రధాని ప్రసంగానికి విపక్షాలు అడుగడుగు నా అడ్డుతగిలాయి. విపక్ష నేత మాట్లాడేం దుకు అనుమతించకపోవడాన్ని నిరసిస్తూ సభ్యులు గందరగోళం సృష్టించారు. విపక్ష నేత మాట్లాడేందుకు అనుమతించాలని నినాదాలు చేస్తూ ప్రధాని ప్రసంగానికి అడ్డుతగిలారు. పాలక పక్ష తీరును నిరసిస్తూ విపక్ష ఎంపీలు నినాదాలు చేస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు.విపక్షాలు ఎగువ సభ ఔన్నత్యాన్ని దిగజారుస్తున్నారని ప్రధాని మోదీ మండిపడ్డారు. సభను విపక్షాలు అవమానించడం తగదని, వారి తీరు మారకపోవడం బాధాకరమని పేర్కొన్నారు.

## త్వరలోనే రైతు రుణమాఫీ: భట్టి



హైదరాబాద్: రుణమాఫీ ఎప్పుడు చేస్తారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు అడుగుత్నాయని, ప్రజల అభిప్రాయాలు తీసుకొని పథకాలపై విధివిధానాలు రూపొందిస్తున్నామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. అన్ని వర్గాలతో మాట్లాడి వచ్చిన రిపోర్టును అసెంబ్లీలో ప్రవేశపెడుతామని, త్వరలోనే రైతు రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. బుధవారం భట్టి మీడియాతో మాట్లాడారు. రైతు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమైన విషయమని, రైతు ఆత్మహత్య వెనక ఎవరు ఉన్న ఉపేక్షించమని హెచ్చరించారు. రైతు ఆత్మహత్య ఘటనపై విచారణకు ఆదేశించామని భట్టి వివరించారు. గత ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీ చేయడానికి ఐదు సంవత్సరాల సమయం తీసుకుందన్నారు. ప్రజలు కట్టిన ప్రతీ పైసా రాష్ట్రాభివృద్ధికి ఉపయోగిస్తామని, జాబ్ క్యాలెండర్ త్వరలోనే ప్రకటిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా ఆరు గ్యారెంటీలు అమలు చేస్తుందన్నారు.

## రాజకీయాల్లో ఏదీ శాశ్వతం కాదు

### మండల పరిషత్ వీడ్కోలులో మంత్రి పొన్నం

సిద్దిపేట,జూలై3): రాజకీయాల్లో ప్రజా జీవితంలో ఏది శాశ్వతం కాదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండల పరిషత్ వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్. 5 సంవత్సరాలు ఎంపిటిసి గా ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో వచ్చారని చెప్పారు. మళ్లీ అందరూ ప్రజా ప్రతినిధులుగా రావాలని కోరుకుంటున్నానని అన్నారు. దేశం మొత్తం స్థానిక సంస్థలకు సంబంధించిన హక్కులు, బాధ్యతలు హరింపబడ్డాయని తెలిపారు. పనుల కోసమో, నిధుల కోసమే గవర్నర్ ని కూడా కలిసే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎందుకు ఇలా జరిగిందనే మననం చేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎన్నికల్లో మనం పని చేసిన దానికి అది నిదర్శనంగా ఉంటుందన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గం అంటే మీకు గౌరవం దక్కేలా తన పని తీరు ఉంటుందని తెలిపారు. ఎండాకాలంలో ఎక్కడ నీటి సమస్య ఉండొద్దని మూడున్నర కోట్లు శాంక్షన్ అయ్యేలా చేశానని చెప్పారు. 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఎంపీపీ, ఎంపీటీసీలకు అభినందనలని వారు మళ్ళీ రాజకీయంగా మరింతగా ఎదగాలని కోరుకుంటున్నానని చెప్పారు మంత్రి పొన్నం.

# రైతు భరోసాపై రేవంత్ రెడ్డి సర్కార్ కసరత్తు




హైదరాబాద్,జూలై 3, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఒక్కొక్కొటిగా అమలు చేస్తూ వస్తోంది. ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఇప్పటికే పలు స్కీములను అమలు చేసింది రేవంత్ రెడ్డి సర్కార్.ఇంకొన్ని హామీలను అమలు చేసే దిశగా కసరత్తు షురూ చేసింది. ఈ క్రమం లోనే రైతులకు సంబంధిం చిన హామీల్లో ఒక్కటైనా రైతురుణమాఫీకి మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. అయితే రైతురుణమాఫీ కోసం ఎదురు చూస్తున్న వారికి త్వరలోనే అమలు చేసేందుకు ప్రభుత్వం రెడీ అవుతోంది.అయితే ఈ స్కీంను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం పకడ్బం దీగా అమలు చేసే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. రైతు భరోసా స్కీం అమలుకు విధివిధానాలు రూపొందించేందుకు సర్కార్ మంత్రి వర్గ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్ర మార్క సబ్ కమిటీ చైర్మన్ గా వ్యవహరిస్తుండగా. మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావును సభ్యులుగా చేర్చింది.ఈ కమిటీ రైతు భరోసా స్కీంకు సంబంధించిన గైడ్ లైన్స్ ను సిద్ధం చేసి ప్రభు త్వానికి అందిస్తుంది. ఇక బీఆర్ఎస్ సర్కార్ రైతు బంధు కింద ఎకరానికి 10వేల రూపాయలు పెట్టుబడి సాయం కింద అందించగా. రేవంత్ రెడ్డి సర్కార్ మాత్రం ఏడాదికొ ఒక్కోఎకరానికి 15వేల సాయం అందిస్తామని చెబుతోంది. అయితే ఎన్నికల్లో ఇచ్చిన హామీని అధికారంలోకి రాగానే రైతు భరోసా అమ లు చేయాల్సి ఉండగా. రైతు బంధు పథకంలో ఎన్నో అవకతవకలు జరిగినట్లు ప్రభుత్వం చెబుతోంది. అవకతవకలన్నింటినీ పరిగణలోనికి తీసుకుని పకడ్బందీగా గైడ్ లైన్స్ రూపొందించేందుకు ప్రభుత్వం తాజాగా కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది.అయితే ఈ సబ్ కమిటీ ఇచ్చే విధివిధానాల ను మాత్రమే పరిగణలోనికి తసుకోకుండా. వాటిని అసెంబ్లీలో చర్చకు పెట్టి. వాటిపై ఆయా పార్టీల నుంచి కూడా సలహాలు సూచనలు తీసుకుంటా మని సీఎం రేవంత్ తెలిపారు. దీంతో రైతు భరోసా స్కీంపై రేవంత్ సర్కార్ ఎలాంటి నిబంధనలు పెడుతుంది. ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందనేది రైతుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

## జూలై 25 వరకు కవిత జ్యుడీషియల్ రిమాండ్ పొడిగింపు



హైదరాబాద్,జూలై3:బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు మరోసారి కోర్టులో చుక్కెదురైంది. ఢిల్లీ రౌస్ ఎవెన్యూ కోర్టు, కవిత జ్యుడీషియల్ రిమాండ్ మళ్లీ పొడిగించింది. ఢిల్లీ లిక్కర్ పాలసీ ఈడీ కేసులో బుధవారంతో ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ రిమాండ్ ముగిసింది.ఈ క్రమంలో ఈరోజు ట్రయల్ కోర్టులో కవితను తీహార్ జైలు అధికారులు హాజరుపర్చారు. దీంతో కోర్టు.. జూలై 25వ తేదీ వరకు కవిత జ్యుడీషియల్ రిమాండ్ పొడిగిస్తూ తీర్పు ఇచ్చింది. కాగా, మార్చి 15వ తేదీన ఈడీ అధికారులు.. హైదరాబాద్ లో కవితను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

## నిండు సభలో ప్రధాని అసత్యాలకు నిరసనగా వాకౌట్ చేశాం : ఖర్గే

న్యూఢిల్లీ:రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చకు బదులిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగిస్తున్న సమయంలో విపక్ష ఎంపీల వాకౌట్‌ను రాజ్యసభలో విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ మల్లికార్జున్ ఖర్గే సమర్ధించుకున్నారు. ప్రధాని ప్రసంగంలో కొన్ని తప్పుడు అంశాలను సభకు వెల్లడించినందుకు నిరసనగా తాము వాకౌట్ చేశామని తెలిపారు. అసత్యాలు పలకడం ఆయనకు అలవాటని సత్యదూరమైన అంశాలను ప్రస్తావిస్తుంటారని ఖర్గే ఆరోపించారు.ప్రధాని రాజ్యాంగం గురించి మాట్లాడుతుంటే మీరు రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తారని తాను పేర్కొన్నానని చెప్పారు. రాజ్యాంగం కోసం పాటుపడేది ఎవరు, దాన్ని వ్యతిరేకించేది ఎవరనేది స్పష్టం చేశానని తెలిపారు. ఆరెస్సెస్ రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తుందని, వారు బీఆర్ అంబేద్కర్, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ దిష్టిబొమ్మలను దగ్ధం చేశారని ఖర్గే అన్నారు. బీఆర్ అంబేద్కర్‌ను కాంగ్రెస్ అగౌరవపరుస్తుందని మోదీ పదేపదే చెబుతుంటారని




అన్నారు.రాజ్యాంగ సభలో బాబా సాహెబ్ ఏం చెప్పారో, ఆర్గనైజర్‌లో ఆరెస్సెస్ ఏం రాసిందో చెప్పాలని తాను భావించానని ఖర్గే తెలిపారు. కాగా, అంతకుముందు రాజ్యసభలో ప్రధాని ప్రసంగానికి విపక్షాలు అడుగడుగునా అడ్డుతగిలాయి. విపక్ష నేత మాట్లాడేందుకు అనుమతించకపోవడాన్ని నిరసిస్తూ సభ్యులు గందరగోళం సృష్టించారు. విపక్ష నేత మాట్లాడేందుకు అనుమతించాలని నినాదాలు చేస్తూ ప్రధాని ప్రసంగానికి అడ్డుతగిలారు. పాలక పక్ష తీరును నిరసిస్తూ విపక్ష ఎంపీలు నినాదాలు చేస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు.విపక్షాలు ఎగువ సభ ఔన్నత్యాన్ని దిగజారుస్తున్నారని ప్రధాని మోదీ మండిపడ్డారు. సభను విపక్షాలు అవమానించడం తగదని, వారి తీరు మారకపోవడం బాధాకరమని పేర్కొన్నారు.

# కౌశిక్ రెడ్డిపై కేసు దుర్మార్గం

**అవినీతిని ప్రశ్నిస్తున్నందుకే కేసు**
**మండిపడ్డ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్**

హైదరాబాద్,జూలై3: బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై కేసు నమోదు చేయడాన్ని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తప్పుపట్టారు. ప్రభుత్వ అవినీతిని ప్రశ్నిస్తున్నందుకే ఆయనపై కేసు నమోదు చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలాంటి బెదిరింపులకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు భయపడరన్నారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలను బెదిరించే ఉద్దేశంతోనే ఇలాంటి అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. ప్రజా పాలనంటే ప్రశ్నించే ప్రజాప్రతినిధులపై అక్రమ కేసులు పెట్టటమేనా..? అని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ మేరకు ఆయన ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రజా సమస్యలను జడ్పీ సమావేశం దృష్టికి తీసుకురావటమే కౌశిక్ రెడ్డి చేసిన నేరమా.. అని కేటీఆర్ ప్రశ్నించారు. నియోజకవర్గం లోని ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు అందుతున్న విద్యా సౌకర్యాలతోపాటు తరగతి గదులలో పారిశుద్ధ్య నిర్వహణ, వసతుల కల్పనపైన మండల విద్యాధికారితో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించటం తప్పా అని ప్రశ్నించారు. ఈ సమావేశానికి ఎందుకు హాజరయ్యారంటూ మండల విద్యాధికారులకు డీఈవో అక్రమంగా నోటీసులు ఇవ్వటమేమిటని అన్నారు. ప్రభుత్వాధికారి అయిన డీఈవో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలాగ వ్యవహరిస్తున్నారనే అంశాన్ని జడ్పీ సమావేశంలో కౌశిక్ లేవనెత్తారని కేటీఆర్ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యేగా తనకున్న అధికారాల మేరకు సమావేశం నిర్వహించటానికి కూడా హక్కు లేదా..? అని ప్రశ్నించారు. దళిత బంధు చెక్కుల పంపిణీతో పాటు, ప్రభుత్వ ఆసుపత్రిలో కేసీఆర్ కిట్లు, న్యూట్రిషన్ కిట్లు, మహిళల కోసం అదనంగా ప్రభుత్వ ఆసుపత్రిలో గైనకాలజిస్టును నియమించాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ అడిగారని, ఇది కూడా నేరమేనా..? అని కేటీఆర్ నిలదీశారు. జడ్పీ సమావేశంలో కలెక్టర్ పట్టించుకోక పోవటంతో నిరసన తెలిపే ప్రయత్నం చేశారని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఒక ప్రజా ప్రతినిధికే నిరసన తెలిపే హక్కు లేదా అని కేటీఆర్ ప్రభుత్వాన్ని నిలదీశారు. కౌశిక్ రెడ్డి ఫిర్యాదు చేసిన అంశాలపై దృష్టి పెట్టాల్సింది పోయి ప్రతిపక్షాల నోరు మూయించాలనే కుట్రతో అక్రమ కేసులకు తెరతీస్తున్నారన్నారని విమర్శించారు. ప్రభుత్వ పెద్దల ఒత్తిడితోనే ఈ కేసు పెట్టారని కేటీఆర్ ఆరోపించారు. కౌశిక్ రెడ్డిపై అక్రమ కేసు బనాయించటం దుర్మార్గ పూరిత చర్య అని ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే కేసును ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. హుజురాబాద్ ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి కౌశిక్ రెడ్డి నియోజకవర్గం లోనే ఉంటూ ప్రజల సమస్యలపై పోరాటం చేస్తున్నారని, ప్రభుత్వ పెద్దల అవినీతి బాగోతం, అక్రమాలను బయటికి తెస్తున్నారని, అందుకే కేసుల ద్వారా ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేసున్నారని విమర్శించారు.

# సంపాదకీయం

గురువారం 04-07-2024

## పార్లమెంట్ ప్రతిష్ఠను దిజార్చరాదు !

లోక్‌సభలో విపక్షాల బలం పెరగడంతో సమస్యలపై చర్చకు అవకాశం వచ్చింది. దేశం ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలపై చర్చ చేయడానికి కార్యాచరణతో ముందుకు రావాలి. బలమైన విపక్షంగా కాంగ్రెస్ మంచి నిర్ణయం తీసుకోవాలి. ప్రభుత్వానికి వణుకు పుట్టించేలా పనిచేయాలి. అంతేగానీ హిందువులను నిందించడం లేదా, గోలచేయడం ద్వారా ప్రజల సమస్యలను ప్రస్తావించలేదు.పార్లమెంటరీ ప్రజాస్వామ్యం లో పనితీరు ముఖ్యం. అయితే అందుకు భిన్నంగా విపక్ష నేతలు వ్యవహరిస్తూ..పార్లమెంట్‌ను అపహాస్యం చేస్తున్న తీరు గర్హనీయం. పద్ధతులు, సంప్రదాయాలు కొనసాగించాల్సిన విపక్షం అందుకు భిన్నంగా వ్యవహరించడం దారుణం కాక మరోటి కాదు. విపక్షనేత రాహుల్ హిందువులను ఉద్దేశించిన చేసిన వ్యాఖ్యలు దారుణం. ఈ దేశం ఎంతగా గాయపడ్డదో..ఎంతగా చితికి పోయిందో చరిత్ర చదివి తెలుసు కోవాలి. ప్రధాని అన్నట్లుగా రాహుల్ నిజంగానే పిల్ల చేష్టలు చేస్తున్నారు. ఆయనకు హుందాతనం లేకుండా పోయింది. హిందువులను ఉగ్రవాదులుగా చిత్రీకరించే ప్రయత్నం చేసిన తీరు దుర్మార్గం. హిందువుల ఉగ్రవాదులు అయితే ఈ దేశంలో దాడులు జరిగేవి కావు. ముస్లింలు, కుషాణులు, బ్రిటిషర్లు, ఫ్రెంచ్, డచ్ వారు ఇక్కడకు వచ్చే ధైర్యం చేసేవారు కాదు. భారతీయులు శాంతికాముకులు కనుకనే వీరంతా దాదాపు 15,16 శతాబ్దాలు పాలించారు. ఇక్కడ ఆలయాలను ధ్వంసం చేసినా, మతమార్పిడులు చేసినా, మానభంగాలు చేసినా, ఆస్తులను ధ్వంసం చేసినా, నలందా లాంటి విశ్వవిద్యాలయాలను తగులబెట్టినా సహించారు. దేశాన్ని ముక్కలు చేసినా సహించారు. ఇవన్నీ చరిత్ర. కాల్పనికం కాదు. వీటిని రాహుల్ చదివి అర్థం చేసుకోవాలి. కుటుంబ పరంగా అందలం దక్కించుకున్న రాహుల్ భారతీయులు గురించి తెలుసుకోవాలి. పార్లమెంటులో ఏదేని అంశంపైనా చర్చకు ఓ పద్దతి, నిబంధనలు ఉంటాయి. వాటిని గుర్తించి చర్చ చేయించేలా, ప్రభుత్వాన్ని నిలదీయాలి. కానీ రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై ప్రధాని సమాధానం ఇస్తున్న సమయంలో చేపల మార్కెట్లో లాగా నినాదాలు చేయడం, అల్లరి చేయడం ప్రజాస్వామ్యం అనిపించుకోదు. ప్రధాని ప్రసంగం వినడం ఇష్టం లేకపోతే పార్లమెంటును వీడాలి. అంతేగానీ గోలచేయడం దారుణం.చివరకు పెద్దల సభలో కూడా గోలచేసిన తీరు క్షంతవ్యం కాదు. లోక్‌సభలో గంటల పాటు గోల చేస్తున్నా..వారిని రాహుల్ వారించక పోవడం రాహుల్ పిల్లచేష్టలకు పరాకాష్టగా చూడాలి. ప్రధాని, మంత్రుల, విపక్ష సభ్యులు అంతా కూడా పార్లమెంటులో చిత్తశుద్ధితో పనిచేయాలి. సమస్యలను పరిష్కరించకున్నా ఫర్వాలేదు. కానీ వాటిపై చర్చకు ఆస్కారం ఇవ్వాలి. దేశంలో ఉన్న సమస్యలు కనీసం ప్రజలకైనా తెలియాలి. ప్రజలు ఏయే సమస్యలు ఎలా ఎదుర్కొంటున్నారో పార్లమెంటులో చర్చ ద్వారా దేశ ప్రజలు గుర్తించాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు ఎన్నడూ జరగనన్ని నేరాలు, ఘోరాల సంఘటనలు దేశంలో అన్ని రాష్ట్రాల్లోనూ అనేకం జరుగుతన్నాయి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం సందర్భంగా ఇవన్నీ ప్రస్తావించాల్సి ఉండేది. నీట్‌పైనా ప్రస్తావించారు. వీటికి ప్రధాని సమాధానం ఇస్తున్న సమయంలో నిలదీసే అవకాశం కూడా ఉంది. కానీ విపక్షం అలా చేయకుండా గోలతో పార్లమెంటును మార్కెట్‌కన్నా అధ్వాన్నంగా చేశారు. స్కూళ్లో పిల్లలు అల్లరి చేస్తే టీచర్లు దండస్తారు. ఇక్కడ వీరిని ఎవరు దండించాలి. ఇలాంటి వారు పార్లమెంట్ సభ్యులుగా అర్హులా అన్నది తేల్చాలి. ఇలాంటి వారిపై కఠినచర్యలు తీసుకోక పోవడంపై మార్పు కానరావడం లేదు. పార్లమెంట్ అంటే మోడీ లేదా విపక్ష పార్టీలకో సంధించిన వ్యవహారం కాదు. ఇది దేశ ప్రజల ఆస్తి. వీరు సమస్యలను చర్చించి పరిష్కరించాలని ప్రజలు ఎన్నుకుని పంపారు. దేశం అనేకానేక సమస్యలు ఎదుర్కొంటోంది. వాటిపైన చర్చచేయాలి. ఎవరు బాధ్యులో ఎవరు బాధ్యులు కాదో తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఐటి,ఇడి దాడుల పైనా చర్చించాలి. అక్రమా లను నిలదీయాల్సిందే. అందుకు ఎవరు కూడా మినహాయింపు కాదు. ప్రధాని మోడీ చెప్పిన లెక్కలపై కసరత్తు చేసి,నిజాలు బయట పెట్టాలి. అలాగే రాష్ట్రాలకు నిధుల విషయంలో నిక్కచ్చిగా ఉండాలి. కేంద్ర పథకాల నుంచి వచ్చిన డబ్బులపైనా జవాబుదారీ తనం చూపాలి. కేంద్రం ఏయే పథకాల కిద ఎంతెంత డబ్బులు ఇచ్చాయో సిఎంలు ప్రకటించాలి. నిధులపై చర్చ చేయాలి. ఆ నిధులను ఇతర పథకాలకు మళ్లించడం జరిగితే వాటిపైనా చర్చించాలి. ప్రజలను మోసం చేస్తూ ఎంతకాలం ఇలా పరస్పర విమర్శలు చేసుకోవడం తగదు. కేంద్రం కూడా ఇరు రాష్ట్రాలపై బెదిరింపు ధోరణిలో వ్యవహరిస్తోంది. ఎంపిలు కూడా చట్టసభల్లో ప్రభుత్వాన్ని కలసికట్టుగా నిలదీసేలా కార్యాచరణ సిద్దం చేసుకోవాలి. కేంద్రం సమస్యలను పరిష్కరించడం లేదన్న విషయాన్ని దేశం దృష్టికి తీసుకుని రావాలి. సమస్యలను గట్టిగా నిలదీయలేక పోవడంతో కేంద్రం కూడా ఉదాసీనంగా ఉంటోంది. ప్రధాని మోడీ తన ప్రసంగంలో అనేకానేక అంశాలను ప్రస్తావించారు. అందులో సత్యాలు, అర్ధసత్యాలు కూడా ఉన్నాయి. సమస్యలపై చర్చ ద్వారా వీటిని ఎండగట్టవచ్చు. బడ్జెట్ సమావేశాలు ముమ్మందు రాబోతున్నాయి. ఈ సమయంలో కూడా చర్చ చేయవచ్చు. అలాగే ఆర్థికరంగాన్ని దివాళా తీయిస్తున్నా నగదు బదిలీ పథకాల ను ఎంతమాత్రం కొనసాగించడం సరికాదు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, నీట్ అవినీతి వంటివన్నీ చర్చకు అర్హమైన అంశాలే. అయితే వీటిపై చర్చ సాగాలి. ఎలాచేస్తే చర్చకు వస్తుందో పార్లమెంట్ సబ్యులు తెలుసుకోవాలి. గోల చేయడం ద్వారా సమస్యలు పరిష్కారం కావు. రాజకీయ లబ్ది నెరవేరదు కూడా. అందువల్ల బలమైన విపక్షం బలహీనమైన పనులు చేయరాదు. గోలచేయడ మానుకోవాలి. పార్లమెంటును సద్వినియోగం చేసుకోవాలి. అప్పుడే ప్రజలు విశ్వసిస్తారు.

## నరుడే నారాయణుడని, మానవసేవయే మాధవసేవ యని చాటిచెప్పిన మహోన్నత మూర్తి స్వామి వివేకానంద



-నేడు స్వామి వివేకానంద వర్ధంతి

మతానికి కొత్త అర్థాన్ని, సేవకు పరమార్థాన్ని నిర్వచించి నరుడే నారాయణుడని, మానవసేవయే మాధవసేవ యని చాటిచెప్పిన మహోన్నత మూర్తి స్వామి వివేకానంద దేశ యువతకు సదా స్ఫూర్తిదాతగా నిలువాలని 1985లో భారత ప్రభుత్వం ఆయన పుట్టినరోజైన జనవరి 12ను జాతీయ యువజన దినోత్సవంగా నిర్ణయించింది. బలమే జీవనం...బలహీనతే మరణం..నువ్వు దేనినైతే ఆలోచిస్తావో ఆవిధంగానే తయారవుతావు. నిన్ను బలహీనుడిగా భావించుకుంటే చివరకు బలహీనుడివే అవుతావు..శక్తిమంతుడిగా భావించుకుంటే శక్తిమంతుడివే అవుతావు. సమస్త శక్తి నీలోనే ఉంది. దానినే విశ్వసించు, నీవు బలహీనుడవని ఎప్పుడూ తలపోయకు..ధీరుడవై నిలిచి నీలోని దివ్యత్వాన్ని ప్రకటించు...అంటూ సమస్త మానవాళిని భయం వదలి సమాజ సేవకు నడుంకట్టాలన్నారు స్వామి వివేకానంద. ఉక్కునరాలు, ఇనుపకండరాలు, వజ్రతుల్యమైన ధృడసంకల్పం, మొక్కవోని విశ్వాసం గల వందమంది యువకులు చాలు...ఈదేశాన్ని ప్రపంచంలో అన్ని రంగాలలో అగ్రగామిగా నిలుపడానికి అంటూ ఎలాంటి యువత నేడు అవసరమో వివరించారు ఆమహనీయుడు. స్వామి సంక్షిప్త జీవిత చరిత్రకలకత్తాకు చెందిన ప్రసిద్ధ న్యాయవాది విశ్వనాథ దత్తా, ఆయన సతీమణి భువనేశ్వరీదేవి దంపతులకు నలుగురు కుమార్తెలు. ఒక మగబిడ్డ కావాలని భువనేశ్వరీ దేవి శివుణ్ని ప్రార్థించింది. 1863 జనవరి 12తేదీ మకర సంక్రాంతి పర్వదినాన నరేంద్రనాథ్ జన్మించారు. ఆ శిశువే అనంతరం స్వామి వివేకానందుడిగా ప్రపంచ ప్రసిద్ధి చెందారు. చిన్నప్పుడు కొంటె పనులు చేసినా, పెంపుడు జంతువులతో ఆటలాడుతూ తల్లి చెప్పే భారత, రామాయణ ఇతిహాసాలను శ్రద్ధగా వినేవాడు.పాఠశాలలో చేరింది మొదలు కళాశాల స్థాయి వరకు ఆ బాలుడిలో అసాధారణ మేధాశక్తి, అద్భుత జ్ఞాపకశక్తిని చూసి సహవిద్యార్థులు, ఉపాధ్యాయులు సైతం ఆశ్చర్యపడేవారు. వివిధ క్రీడల్లో ప్రావీణ్యం చూపడంతోపాటు మూఢనమ్మకాలను నమ్మకుండా ధైర్యసాహసాలు ప్రదర్శించేవాడు. చిన్నప్పటినుంచే ధ్యానంపై దృష్టి నిలిపిన నరేన్ త్రాచుపాము సమీపించినా ధ్యానముద్ర వీడేవాడుకాదు. గదిలో బంధించినా నిరుపేదలను చూసి చలించి ఇంట్లో ఉన్నవన్నీ కిటికీలగుండా దానం చేసేవాడు. దేవుడంటే ఎవరు, ఎలా ఉంటాడో కనుక్కోవాలన్న తపనతో ఎంతమందిని అడిగి చూసినా ఫలితం లేకపోవడంతో దక్షిణేశ్వర కాళికాలయానికి వెళ్లి శ్రీరామకృష్ణ పరమహంసను కలుసుకున్నాడు. కోరుకుంటున్న శిష్యుడు, గురువు దొరికేసరికి రామకృష్ణులవారి సంతోషానికి, శిష్యుడి సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. దైవసాక్షాత్కారం కోసం నిరంతర ధ్యానం చేశారు. పరివ్రాజకునిగా దేశసంచారం చేశారు. ఎన్నో క్షేత్రాలు తిరిగి భారతదేశంపై పూర్తి అవగాహనకు వచ్చారు. పేద ధనిక తేడాలకు కలత చెందేవారు. కన్యాకుమారి చేరుకుని ఆమె దివ్య సమక్షాన్ని అనుభూతి చెందిన స్వామిలో ఆధ్యాత్మికతతోపాటు దేశభక్తి మిళితమైంది. స్వామి ప్రసంగాలకు ముగ్ధులైన మద్రాసు ప్రజలు విరాళాలు సేకరించగా 30 ఏళ్ల వయసులో త్యాగభూమి నుంచి భోగభూమి అయిన అమెరికాకు వెళ్లారు. అక్కడ ఎన్నో కష్టాలు ఎదురైనా లెక్కచేయకుండా 1893 సెప్టెంబర్ 11న చికాగోలో ప్రారం భమైన సర్వమత మహాసభలో వివిధ మతాలకు చెందిన ప్రతిని ధులు, దాదాపు 7వేల మంది శ్రోతలు ఉన్నసభలో స్వామి ప్రవేశిం చారు. అమెరికా సోదర సోదరీమ ణులారా నామతం గొప్పదంటే.. కాదు కాదు నామతం గొప్పది కొట్లాడుకుంటున్న కాలంలో కాషాయం కట్టిన ఓ సాధారణ సన్యాసిగా చికాగోలోని సర్వమత సమ్మేళనంలోకి అడుగుపెట్టి ఓ నా అమెరికా సోదర సోదరీమణులారా అంటూ ఆత్మీయ సంబోధనతో ప్రపంచదేశాలకు భారతీయ సోదరభావాన్ని, ఔన్నత్యాన్ని చాటిచెప్పారు. ఆయన ఆత్మీయ సంబోధన విని వేలాదిమంది లేచి రెండు నిమిషాలపాటు చప్పట్లతో ఆనందానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన అనర్గళంగా చేసిన విశ్వజనీన ప్రసంగానికి మంత్రముగ్ధులయ్యారు. అంతవరకు ఎవరికీ తెలియని స్వామి అసాధారణ ధార్మిక ప్రబోధకుడిగా కీర్తిగాంచారు. చికాగో వీధుల్లో వెలసిన ఆయన చిత్రపటాలకు వందనం చేయనివారు లేరంటే అతిశయోక్తికాదు. డిసెంబర్ 16న ఆయన మాతృభూమికి ప్రయాణమవుతుండగా ఆయనను వీడలేకనే అఖండ జనం ఆయనకు వీడ్కోలు పలికారు. మాతృదేశంలో ఆయనకు ఘన స్వాగతం లభించింది.అనంతరం 1899 జూన్ 20న కూడా మరోమారు పాశ్చాత్య దేశాలలో పర్యటనకు వెళ్లివచ్చారు. తన నలభయ్యవ పుట్టిన రోజును చూడబోనని స్వామిజీ సూచించినట్లుగానే 1902 జూలై 4వ తేదీన రాత్రి 9:10గంటలకు స్వామిజీ మహాసమాధి పొందారు.


## 'ఉచిత.. గిచిత.. ప్రయాణం లేదు! దిగండి..' ఆర్టీసీ బస్సు కండక్టర్ భాగోతం

వేములవాడ, జూన్ 3: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఆర్టీసీ ఉచిత ప్రయాణం రోజుకొక్క వివాదంలో ఇరుక్కుంటుంది. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని రేవంత్ సర్కార్ చెబుతున్నా..క్షేత్రస్థాయిలో మాత్రం మహిళలకు ఇబ్బందులు తప్పడం లేదు. తాజాగా వేములవాడ రాజన్న దర్శనానికి వచ్చిన ఓ కుటుంబానికి చేదు అనుభవం ఎదురైంది. దర్శనం అనంతరం ఇంటికి బయల్దేరిని కుటుంబం సోమవారం సాయంత్రం జగిత్యాల బస్‌స్టాప్‌లో ఆర్టీసీ బస్సు ఎకేందుకు ప్రయత్నించారు. ఇంతలో వారిని డోర్ వద్ద అడ్డుకున్న లేడీ కండక్టర్ వారిని ఆర్టీసీ బస్సు ఎక్కకుండా అడ్డుకుంది.'ఉచిత.. గిచిత ప్రయాణం లేదు. ముందు తనిఖీ అధికారులు ఉన్నారు. వారు చూస్తే రూ.500 ఫైన్ విధిస్తారు' అంటూ సదరు బస్సు కండక్టర్ కస్సుబుస్సుమంది. ఆ వెంటనే సదరు కుటుంబ సభ్యులను కూడా బలవంతంగా కిందికి దించేసింది. దీంతో ఈ మొత్తం వ్యవహారాన్ని అదే బస్సులో ఉన్న తోటి ప్రయాణికులు వీడియో తీసి సోషల్ మీడియాల్ పోస్ట్ చేశారు. అది కాస్తా వైరల్‌గా మారడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.ఇలా బలవంతంగా బస్సు నుంచి కిందికి దింపడంతో సదరు కుటుంబసభ్యులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. చేసేదిలేక మరో బస్సు వచ్చేంత వరకు వేచి చూశారు. ఈ పంచాయితీ వేములవాడ ఆర్టీసీ డిపో మేనేజర్ మురళీకృష్ణ వద్దకు చేరడంతో



అసలేం జరిగిందనే దానిపై ఆరా తీయడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో సదరు బస్సు కండక్టర్‌ను పిలిపించి ఆమెను విచారించినట్టు తెలుస్తోంది. అయితే ప్రయాణికులతో దురుసుగా ప్రవర్తించిన మహిళా కండక్టర్‌పై ఎలాంటి చర్యలు తీసుకున్నారనే దానిపై ఇప్పటి వరకూ సమాచారం లేదు.

## బీహార్‌లో కూలిన మరో బ్రిడ్జి.. 15 రోజుల్లో ఆరో ఘటన



బీహార్ , ఎన్డీయే పాలిత బీహార్ లో వరుసగా బ్రిడ్జిలు కూలుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా మరో బ్రిడ్జి కూలింది. సివాన్ జిల్లాలోని గండకి నదిపై నిర్మించిన ఈ చిన్న వంతెనలోని ఒక భాగం బుధవారం ఉదయం కూలిపోయింది. వంతెన కూలిపోవడానికి గల కచ్చితమైన కరాణాలపై విచారణ జరుపుతున్నట్లు డిప్యూటీ డెవలప్‌మెంట్ కమిషనర్ ముఖేష్ కుమార్ తెలిపారు.'బుధవారం ఉదయం డియోరియా బ్లాక్‌లోని వంతెన యొక్క ఒక భాగం కూలిపోయింది. బ్రిడ్జి కూలడానికి గల ఖచ్చితమైన కారణాలు ఇప్పటివరకూ తెలియరాలేదు. సీనియర్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ సంఘటన తెల్లవారుజామున 5 గంటలకు జరిగింది. ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ వంతెన 1982-83లో నిర్మించారు. గత కొన్ని రోజులుగా ఈ వంతెనపై మరమ్మతు పనులు జరుగుతున్నాయి' అని ఆయన తెలిపారు.కాగా, రాష్ట్రంలో వంతెన కూలిపోవడం 15 రోజుల వ్యవధిలో ఇది ఆరోది. సివాన్ జిల్లాలో 11 రోజుల వ్యవధిలో ఇది రెండో ఘటన కావడం గమనార్హం. గత నెల 22న సివాన్ జిల్లాలో చిన్నపాటి వంతెన ఒకటి కుప్పకూలింది. దారౌందా, మహారాజా గంజ్ బ్లాక్స్‌లోని రెండు గ్రామాలను కలుపుతూ కెనాల్‌పై కట్టిన ఈ బ్రిడ్జ్..చాలా ఏండ్ల క్రితం నాటిదని, కెనాల్‌లోని నీటి ప్రవాహ ధాటికి పిల్లర్లు దెబ్బతిని వంతెన కూలిందని జిల్లా కలెక్టర్ ముకుల్ కుమార్ గుప్తా తెలిపారు.జూన్ 27న కిషన్‌బాగ్ జిల్లాలో, జూన్ 23న తూర్పు చంపారన్ జిల్లాలో, 22న సిశాన్‌లో, 19న అరారియాలో ఇలాగే వంతెనలు కూలిపోయాయి. ఆ తర్వాత జూన్ 29న మధుబని ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న వంతెన ఒక్కసారిగా కూలిపోయింది.వరుసగా వంతెనలు కూలిపోతుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నదులు, కాలువలపై నిర్మించిన వంతెనల పటిష్టతపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పబ్లిక్ వర్క్సలో నాణ్యతా లోపాలు, అక్రమాల వల్లే ఈ ఘటనలు జరుగుతున్నాయని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్నది. వరుస ప్రమాదాలతో అధికారులు కూడా ఒకింత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇవన్నీ ప్రమాదవశాత్తు కూలిపోయాయా..? లేక ఎవరైనా కావాలనే కూల్చి వేస్తున్నారా..? అనే కోణంలో దర్యాప్తు చేపడుతున్నారు.

## కాలంతో పాటే పరుగెత్తాలి! ( ఆధ్యాత్మిక చింతన )

తిరుమల,జూలై3(ఆర్‌ఎన్‌ఎ): కాలం బలమైనది. దానికి ఆగేశక్తి లేదు. పరుగెత్తుతూనే ఉంటుంది. అందుకే కాలం గిర్రున తిరిగిందన్న ప్రయోగం చేస్తుంటాం. కాలనుగుణంగా నడచుకోవడం అలవర్చుకోవాలి. మనం కాలాన్ని సద్వినియోగం చేసుకోవడానికి దినచర్యను చక్కగా అవలంబించాలని శాస్త్రాలు చెబుతున్నాయి. ఏ వేళ ఏ పనిచేయాలో, ఆ వేళ ఆ పని చేయడమే కాలాన్ని సద్వినియోగం చేసుకోవడమని గుర్తించాలి. కాలం కలిసివచ్చినప్పుడు స్పందించకపోతే, మనిషి కోసం కాలం ఆగదు. నీటి ప్రవాహం సాగిపోయిన తరవాత ఆ నీటిని పట్టుకోవడం సాధ్యం కాదు. కాలం మనిషికి ఎన్నో సదవకాశాలను ప్రసాదిస్తోంది. వాటిని అందుకోకుండా జాప్యం చేస్తే భవిష్యత్తు శూన్యమే అవుతుంది. నిన్నటి పని మొన్ననే చేసి ఉండటం, నేటి పనిని నిన్ననే పూర్తిచేయడం, రేపటి పనిని నేడే పూరించడం కార్యసాధకుడి లక్షణం.నిజంగా కాలం మించిపోతోంది. అప్రమత్తంగా ఉండకపోతే అవకాశాలు కళ్లముందే పరుగెత్తిపోతుంటాయన్నది వాస్తవం. బాల్యంలో చక్కగా చదువుకోకుండా ఆటపాటలతో, వ్యసనాలతో కాలాన్ని గడిపేవారికి యౌవనం అందంగా కనిపించదు. అదొక రాక్షసిలా భయపెడుతుంది.

## బాబాలకు పాలకులు సాగిలపడుతుంటే ఇలాంటి ఘటనలు తప్పవు : ఆప్ నేత సంజయ్ సింగ్




యూపీలోని హాథ్రాస్‌లో జరిగిన భోలే బాబా( సత్సంగ్‌లో విషాదం దేశవ్యాప్తంగా దుమారం రేపుతోంది. ఇంత పెద్దసంఖ్యలో ఓ ఆధ్యాత్మిక కార్యక్రమం జరుగుతున్నా ఆస్థాయిలో పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. తొక్కిసలాటలో దాదాపు 121 మంది మరణించారు. ఈ ఘటనకు బాధ్యులైన బాబా ఆచూకీ అంతుబట్టడం లేదు. ఇక మంగళవారం మధ్యాహ్నం 3.30 నిమిషాలకు .. సత్సంగ్ ప్రాంగణం వద్ద తొక్కిసలాట జరిగింది.కానీ ఆ ఘటన తర్వాత భోలే బాబా ఆనవాళ్లు దొరకడం లేదు. ఆయన పరారీలో ఉన్నట్టు పోలీసులు భావిస్తున్నారు. ఆ బాబా కోసం గాలింపు చర్యలు చేపడుతుండగా ఈ ఘటనపై దేశవ్యాప్తంగా కలకలం రేగింది. ఇక హథ్రాస్ తొక్కిసలాట ఘటనపై ఆప్ నేత సంజయ్ సింగ్ స్పందిస్తూ దేశంలో ప్రజల ప్రాణాలకు విలువలేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు.ఓ వ్యక్తి ఏకంగా తన పేరిట బాబా బజార్‌ను నిర్మిస్తున్నా ఆయనపై ఎలాంటి నియంత్రణ లేదని అన్నారు. ఇది కేవలం హథ్రాస్‌లోనే కాదని, దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. హరియాణలో ఏం జరిగిందో మనమంతా చూశామని, హత్యాచార ఘటనలో దోషిగా తేలిన ఓ బాబా తాను కోరుకున్నప్పుడు బయటకు వస్తారని, ప్రభుత్వ యంత్రాంగం ఆయనకు సాగిలపడుతుందని అన్నారు. ఇలాంటి బాబాల మార్కెట్ దేశంలో ఓ వెలుగు వెలుగుతుంటే ఇలాంటి ఘటనలను ఎలా నియంత్రిస్తారని ప్రశ్నించారు.

## నీట్‌ను తొలించడం మంచిదే

### తమిళ అసెంబ్లీ తీర్మానాన్ని స్వాగతించిన విజయ్



చెన్నై,జూలై3(ఆర్‌ఎన్‌ఎ): నీట్‌ను రద్దు చేయడంతో పాటు, నీట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని తమిళనాడు అసెంబ్లీ చేసిన తీర్మానాన్ని నటుడు తమిళగ వెత్రి కళగం' అధినేత విజయ్ స్వాగతించారు. నీట్ అవసరం లేదని స్పష్టం చేశారు. దేశ వ్యాప్తంగా వైద్య సీట్ల భర్తీ కోసం నిర్వహించే నీట్‌యూజీ-2024 పరీక్ష నిర్వహణపై దేశవ్యాప్తంగా గందరగోళం నెలకొంది. అదే సమయంలో పేపర్ లీక్ ఘటనలు వెలుగులోకి రావడం దుమారం రేపింది. దీనిపై చర్చ జరపాలని పార్లమెంట్‌లో విపక్షాలు పట్టుబడు తున్నాయి. ఈ పరిణామాల మధ్య ప్రముఖ నటుడు, 'తమిళగ వెత్రి కళగం' అధినేత విజయ్ తొలిసారి స్పందించారు. నీట్ పరీక్షపై ప్రజలు విశ్వాసం కోల్పోయారు. అది ఈ దేశానికి అవసరం లేదు. నీట్ నుంచి మినహాయింపు ఒక్కటే పరిష్కారం. ఆ పరీక్షకు వ్యతిరేకంగా రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదించిన తీర్మానాన్ని స్వాగతిస్తున్నాను. తమిళనాడు ప్రజల భావోద్వేగాలను గౌరవించాలని కేంద్రాన్ని కోరుతున్నాను. విద్యను ఉమ్మడి జాబితా నుంచి రాష్ట్ర జాబితాకు తీసుకురావాలి. తాత్కాలిక పరిష్కారంగా రాజ్యాంగాన్ని సవరించి 'ప్రత్యేక ఉమ్మడి జాబితా'ను తయారుచేయాలి. దానికింద విద్య, ఆరోగ్యాన్ని చేర్చాలని సూచించారు.ఇటీవల తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నీట్ పరీక్షను రద్దు చేయాలని ఆ రాష్ట్ర అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానించింది. వైద్యసీట్లను భర్తీ చేసుకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు కల్పించాలని, మునుపటిలా 12వ తరగతి మార్కుల ఆధారంగా సీట్లు కేటాయింపులు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టగా అధికారపక్షంతోపాటు విపక్ష నేతలు కూడా ఆమోదం తెలిపారు. నీట్ పరీక్ష వద్దని తమిళనాడు పదేపదే చెబుతోందని ఆ సందర్భంగా గుర్తు చేసిన డీఎంకే ఎంపీ కనిమొళి.. నీట్ నిర్వహణలో డొల్లతనం బయటపడిందన్నారు. ఈ పరీక్ష వల్ల విద్యార్థులు ఎంతో కోల్పోతున్నారని పేర్కొన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో మే 5న నీట్ యూజీ 2024 పరీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. దేశవ్యాప్తంగా 4,570 కేంద్రాల్లో దాదాపు 24 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్ష రాశారు. అయితే.. 67 మంది విద్యార్థులకు 720కి 720 మార్కులు రావడం. అంతేకాకుండా ఒకే సెంటర్‌లో పరీక్ష రాసిన పలువురు విద్యార్థులకు ఫస్ట్ ర్యాంకు రావడం అనుమానాలకు దారితీసింది.

## పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలను యజమానులు సరైన తీసుకెళ్ళవచ్చు

### జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

రాజన్న సిరిసిల్ల,జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు సందర్భాల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను మరియు వివిధ సందర్భలలో సీజ్ చేయబడిన వాహనాలను వాహన యజమానులు 6 నెలలలోపు సరైన పత్రాలు చూపెట్టి వాహనాలను తీసుకవేళ్ళచు అని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్లలో పలు సందర్భాల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలు,యజమానులు తీసుకోకుండా ఉన్న వాహనాలు, గుర్తు తెలియని వాహనాలను జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ కి తరలించినట్లు తెలిపారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా 55,ఆటోలు 09, కార్స్ 2, సుమో1, బైక్స్ 43 వాహనాలను ఉన్నాయని తెలిపారు.

## నార్కోటిక్స్ పోలీసులు కీలక నిర్ణయం.. గంజాయిపై సమాచారం ఇస్తే రూ. 2 లక్షలు నగదు




హైదరాబాద్ : రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలించడానికి తెలంగాణ నార్కోటిక్స్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. 100 కిలోల కంటే ఎక్కువ గంజాయి స్మగ్లింగ్ గురించి సమాచారం ఇచ్చిన వారికి రూ. 2 లక్షల నగదు బహుమతి ఇస్తామని ప్రకటించారు. సమాచారం ఇవ్వాలి అనుకున్నవాళ్లు 8712671111 నంబర్‌కు కాల్ చేయాలని పోలీసులు సూచించారు.డ్రగ్స్, సైబర్ నేరాలను రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని, అందుకోసం ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా విస్తృత ప్రచారం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కోరిన సంగతి తెలిసిందే. డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమంలో భాగస్వామి అయిన మెగాస్టార్ చిరంజీవిని ప్రత్యేకంగా అభినందించారు. ఆయనలా హీరో, హీరోయిన్లు స్వచ్ఛందంగా ముందుకొచ్చి పౌరులకు అవగాహన కల్పించాలని కోరారు. మీడియా ఫోకస్ రాజకీయ అంశాలకే పరిమితం కాకూడదని, డ్రగ్స్, సైబర్ నేరాలపైనా దృష్టిసారించాలని రేవంత్‌రెడ్డి సూచించారు.ఈ యజ్ఞం విజయవంతమయ్యేందుకు పౌరసంబంధాలశాఖ, పోలీసు, ఎక్సైజ్, ఫైర్, థియేటర్ యజమానులు, సినిమా ప్రముఖులు, మీడియా ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డ్రగ్స్, సైబర్ నేరాలపై చిత్తశుద్ధితో పనిచేసే పోలీసులకు పదోన్నతులు, రివార్డులు ఇస్తామని తెలిపారు. ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య సైబర్ క్రైమ్స్, డ్రగ్సేనని సీఎం తెలిపారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన నేరాలు, చిన్నారులపై అఘాయిత్యాలు డ్రగ్స్ మత్తులో జరిగినవేనని పేర్కొన్నారు. ఉద్యమాలకు కేరాఫ్‌గా ఉన్న తెలంగాణ డ్రగ్స్‌కు బానిస కావొద్దని పిలుపునిచ్చారు.

## సుధా మూర్తి ప్రసంగంపై ప్రధాని మోదీ ప్రశంసలు



న్యూఢిల్లీ: రాజ్యసభ ఎంపీ సుధామూర్తిపై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై ఆయన మాట్లాడుతూ.. సుధామూర్తి తన ప్రసంగంలో స్త్రీల ఆరోగ్య సమస్యల గురించి చర్చించినట్లు వెల్లడించారు. మహిళల ఆరోగ్యం గురించి సవివరంగా మాట్లాడిన సుధామూర్తికి థ్యాంక్స్ చెబుతున్నానని ఆయన అన్నారు. ఆ సమయంలో సుధామూర్తి లేచి నిలబడి ప్రధానికి నమస్కరించారు. తల్లుల గురించి కూడా సుధా మూర్తి భావోద్వేగంగా ప్రసంగించినట్లు మోదీ తెలిపారు. సుధామూర్తి తన ప్రసంగంలో మాట్లాడుతూ.. తల్లి చనిపోయినప్పుడు ఆస్పత్రిలో ఒకరి మరణంగా నమోదు చేస్తారని, కానీ ఓ కుటుంబానికి ఆ తల్లి ఎప్పటికీ దూరమైనట్లే అని పేర్కొన్నారు.సుధా చేసిన ఆ వ్యాఖ్యలను ప్రధాని ప్రస్తావిస్తూ.. తమ ప్రభుత్వం మహిళల ఆరోగ్యం, శానిటేషన్‌పై గత పదేళ్లుగా ప్రియార్టీ ఇస్తోందన్నారు. తాము నిర్మించిన టాయిలెట్ల వల్ల దేశంలోని మహిళలు లబ్ధి పొందినట్లు ఆయన చెప్పారు. మహిళలకు శానిటరీ ప్యాడ్స్ అందించామని, గర్భిణి స్త్రీలకు వ్యాక్సినేషన్ ప్రోగ్రామ్ చేపట్టినట్లు తెలిపారు. సర్వైకల్ క్యాన్సర్ పట్ల ప్రభుత్వం వ్యాక్సినేషన్ ప్రోగ్రామ్ చేపట్టాలని సుధామూర్తి తన ప్రసంగంలో ప్రస్తావించారు.

## తలలో పెన్ను గుచ్చుకుని.. నాలుగేళ్ల బాలిక మృతి

హైదరాబాద్ : సాధారణంగా చిన్న పిల్లలు పెన్నులతో ఆడుకోవడం చూస్తూనే ఉంటాం.. పిల్లలు మారాం చేస్తున్నారని అలా పెన్నులు, ఇతరత్రా వస్తువులు ఇచ్చి వాళ్లను బుజ్జగిస్తాం.. కానీ దాని వెనుక ఉన్న ప్రమాదాల విషయంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తుంటాం.. దీనివల్ల ప్రాణాలు పోయే పరిస్థితులు కూడా రావొచ్చు. తాజాగా భద్రాచలం పట్టణంలోని సుభాష్‌నగర్‌లో జరిగిన ఈ ఘటనే అందుకు ఉదాహరణ!.నాలుగేళ్ల చిన్నారి రియాన్షిక సోమవారం మంచంపై ఆడుకుంటుండగా కిందపడింది. దీంతో ఆమె చేతిలో ఉన్న పెన్ను ఎడమ చెవిపైన తలకు గుచ్చుకుంది. దాదాపు సగం పెన్ను చిన్నారి తలలోకి పోయింది. దీంతో తీవ్ర రక్తస్రావమైన చిన్నారి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఇది గమనించిన తల్లిండ్రులు చిన్నారిని భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి.. అక్కడి నుంచి ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.అక్కడ న్యూరోసర్జన్ అందుబాటులో లేకపోవడంతో వెంటనే ఖమ్మం తరలించారు. ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఆపరేషన్ చేసిన వైద్యులు తలలోకి దిగిన పెన్నును తొలగించారు. సర్జరీ తర్వాత బ్రెయిన్ ఇన్‌ఫెక్షన్ కావడంతో చిన్నారి ఆరోగ్యం విషమించింది. దీంతో బుధవారం ఉదయం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది.



# చర్లపల్లి నుంచి 213 మంది ఖైదీల విడుదల

### సత్ప్రవర్తన కారణంగా విడుదల చేస్తూ ప్రకటన
### బంధువుల రాకతో సందడిగా జైలు ప్రాంగణం



హైదరాబాద్,జూలై3: చర్లపల్లి జైలు నుంచి మొత్తం 213 మంది ఖైదీలు విడుదలయ్యారు. ఖైదీల కోసం వచ్చిన కుటుంబసభ్యులతో జైలు ఆవరణలో కోలాహలం నెలకొంది. జైల్లో సత్ప్రవర్తన కనబర్చిన ఖైదీలను విడుదల చేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఉన్న ఖైదీలను చర్లపల్లికి తీసుకొచ్చి విడుదలచేశారు. ఖైదీల విడుదలకు సంబంధించి హోంశాఖ కార్యదర్శి ఇటీవల జీవో నెంబర్ 37 జారీ చేశారు. విడుదలైన ఖైదీల్లో జీవిత ఖైదీలతోపాటు ఇతర శిక్షలు పడిన ఖైదీలు కూడా ఉన్నారు. చాలారోజుల తర్వాత ఖైదీలు బయటికి రావడంతో వారి కుటుంబసభ్యుల్లో ఆనందం వెల్లివిరిసింది. జైళ్ల శాఖ అత్యున్నత స్థాయి కమిటీ మొత్తం 231 మంది ఖైదీల విడుదలకు సిఫారసు చేస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. దీంతో 213 మంది ఖైదీల విడుదలకు గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ఆమోదముద్ర వేశారు. 213 మంది ఖైదీలను విడుదల చేస్తున్నట్లు జైళ్ల శాఖ డీజీ కార్యాలయం మంగళవారం ఓ ప్రకటన కూడా విడుదల చేసింది. వివిధ జిల్లాల నుంచి ఖైదీలను చర్లపల్లి సెంట్రల్ జైలుకు తీసుకువచ్చి, అక్కడ వారికి కౌన్సిలింగ్ ఇచ్చి, వృత్తినైపుణ్య శిక్షణ కూడా ఇచ్చారు. అధికారిక ప్రక్రియ అంతా పూర్తిచేసి ఇవాళ విడుదల చేశారు. అయితే ఖైదీలను షరతులతో విడుదల చేశారు. ఈ షరతుల ప్రకారం.. ప్రతి ఖైదీ బయటకు వెళ్ళిన తర్వాత శాంతియుతంగా సత్ప్రవర్తన కలిగి ఉంటానని, లేదంటే తిరిగి శిక్ష అనుభవిస్తానని రూ.50 వేలకు వ్యక్తిగత పూచికత్తుతో బాండ్ ఇవ్వాల్సి ఉంటుంది. గతంలో విధించిన శిక్షాకాలం పూర్తయ్యే వరకు వారి గ్రామ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో ప్రతి మూడు నెలలకు ఒకసారి హాజరు కావాల్సి ఉంటుంది. మళ్ళీ ఏదైనా నేరం చేస్తే రద్దు చేసిన శిక్షను తిరిగి అమలు చేస్తారు. జిల్లా అధికారి సదరు ఖైదీని గమనిస్తూ ఉండడంతోపాటు, ఆ ఖైదీని విడుదల చేసిన జైలుకు ఆరు నెలలకు ఒకసారి రిపోర్టును కూడా సమర్పించాలి

# జాబ్ కాలెండర్‌పై కసరత్తు..

హైదరాబాద్, జూలై 3, (న్యూస్ పల్స్)ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు శుభవార్త. రాష్ట్రంలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించటంతో వార్షిక జాజ్ కేలండర్ తయారీ పనిలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ బిజీబిజీగా ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల వేళ.. నిరుద్యోగులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే పలు నోటిఫికేషన్లు విడుదల కాగా, మంగళవారం ఆర్టీసీలోని 3035 పోస్టులకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. దీనికి కొనసాగింపుగా ఆగస్టులో మరో 6000 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం పచ్చజెండా ఊపనుంది. గతంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిన జాబ్ క్యాలెండర్‌తో పాటు గ్రూప్ 2, 3 పోస్టులు పెంచాలని నిరుద్యోగులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దీంతో వీలున్నంత వేగంగా, పారదర్శకంగా ఉద్యోగాల భర్తీ నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇదే సమయంలో ఇప్పటికే రాత పరీక్ష దశలో ఉన్న నియామక ప్రక్రియను త్వరలోనే పూర్తి చేసి ఫలితాలు ప్రకటించేలా రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు సూచనలు చేస్తోంది.ప్రజా రవాణాలో కీలక పాత్ర పోషిస్తున్న ఆర్టీసీలో దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. దీంతో మంగళవారం 3035 పోస్టులతో కొత్త నోటిఫికేషన్ విడుదలైంది. ఇప్పటికే ఆర్టీసీలో 43వేల మంది పనిచేస్తుండగా, తాజాగా ఈ కొత్త నోటిఫికేషన్ విడుదల చేశారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణ పథకాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న కారణంగా.. ఈ నోటిఫికేషన్‌లోని డ్రైవర్, శ్రామిక్, డిప్యూటీ సూపరింటెండెంట్ (మెకానిక్), డిప్యూటీ సూపరింటెండెంట్ (ట్రాఫిక్) తదితర ఉద్యోగాలను వీలున్నంత త్వరగా భర్తీ చేసి మరింత మెరుగైన ప్రయాణ సేవలను అందించాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారుగతంలో విడుదలైన నోటిఫికేషన్లకు సంబంధించి రాత పరీక్షల దశలో ఉన్నవాటిపై ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రస్తుతం గ్రూప్ 4 పరీక్ష పూర్తై, అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతోంది. గతంలో రద్దైన గ్రూప్ 1 నోటిఫికేషన్‌కు మరిన్ని పోస్టులు కలిపి కొత్త ప్రభుత్వం కొత్త నోటిఫికేషన్ విడుదల చేసి, ప్రిలిమినరీ పరీక్షను విజయవంతంగా నిర్వహించింది. అక్టోబర్ 21 నుంచి 27 వరకు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరగనున్నట్లు కమిషన్ ప్రకటించింది. అలాగే, డీఎస్సీ పరీక్షల షెడ్యూల్ కూడా విడుదలైంది. గ్రూప్ 2 పరీక్షను ఆగస్టులో నిర్వహించేందుకు కమిషన్ సన్నాహాలు చేస్తోంది. గతంలో ప్రశ్నపత్రాల లీకేజీతో రద్దైన డీఈవో లాంటి పరీక్షలు జరుగుతున్నాయి.

# ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు దక్కని ఊరట..

### జూలై 12 వరకు జ్యుడిషియల్ కస్టడీ పొడిగింపు

ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కేజ్రీవాల్‌కు మళ్లీ షాక్ తగిలింది. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని జూలై 12 వరకు పొడిగించారు. ఢిల్లీలోని రూస్ అవెన్యూ కోర్టు బుధవారం (జూలై 3) జ్యుడీషియల్ కస్టడీ కాలాన్ని పొడిగిస్తూ తీర్పునిచ్చింది.ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో 2024 మార్చి 21న ఈడీ అరెస్టు చేసింది. కాగా, మెడికల్ బోర్డుతో సంప్రదింపుల సమయంలో తన భార్యను వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా హాజరు కావడానికి అనుమతించాలని డిమాండ్ చేసిన సీఎం కేజ్రీవాల్ పిటిషన్‌పై కోర్టు తన నిర్ణయాన్ని రిజర్వ్ చేసింది. జులై 6న కోర్టు తీర్పు వెలువరించనుంది.ఢిల్లీ లిక్కర్ స్కాంలో కేజ్రీవాల్‌కు కష్టాలు రెట్టింపయ్యాయి. అరవింద్ కేజ్రీవాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్, సీబీఐ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. సీబీఐకి సంబంధించిన కేసులో బెయిల్ మంజూరు చేయాలని సీఎం కేజ్రీవాల్ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై త్వరగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై శుక్రవారం విచారణ జరగనుంది. సీఎం కేజ్రీవాల్‌ను అక్రమ నిర్బంధంలో ఉంచారని, చట్టాన్ని పాటించడం లేదని కేజ్రీవాల్ తరుపు న్యాయవాది రజత్ భరద్వాజ్ ఆరోపించారు.ఈ కేసులో గురువారం విచారణకు న్యాయవాది అప్పీల్ చేయగా, జస్టిస్ మన్మోహన్, "మొదట న్యాయమూర్తులు పేపర్‌లను చూడనివ్వండి.. ఆ తర్వాత కేసును మరుసటి రోజు విచారిస్తాం" అని తేల్చి చెప్పారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో సీఎం కేజ్రీవాల్‌కు 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధించింది రౌస్ అవెన్యూ కోర్టు. సీబీఐ కస్టడీ ముగిసిన వెంటనే సీబీ అరెస్ట్ చేసింది. మూడు రోజుల పాటు ఆయన్ను సీబీఐ విచారించింది. కస్టడీ ముగియడంతో కేజ్రీవాల్‌ను రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపర్చారు. కోర్టు కేజ్రీవాల్‌కు జులై 12 వరకు జ్యుడిషియల్ కస్టడీ విధించింది. దీంతో కేజ్రీవాల్‌ను మళ్లీ తిహార్ జైలుకు తరలించారు. కేజ్రీవాల్ విచారణకు సహకరించడం లేదని , తమ ప్రశ్నలకు కేజ్రీవాల్ పొంతనలేని సమాధానం చెప్పారని కోర్టుకు సీబీఐ తెలిపింది.అయితే సీబీఐ తప్పుడు ఆరోపణలు చేస్తోంది కేజ్రీవాల్ తరపు న్యాయవాది విక్రం చౌదరి తెలిపారు. సీబీఐ దగ్గర ఉన్న సాక్ష్యాలను వెంటనే కోర్టుకు సమర్పించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. సీబీఐ ఈ కేసులో ఇప్పటివరకు నాలుగు చార్జ్‌షీట్‌లు దాఖలు చేసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితతో పాటు ఆప్ నేత మనీష్ సిసోడియాను కూడా నిందితులుగా పేర్కొన్నారు. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు కేజ్రీవాల్‌ను ఈ ఏడాది ఫిబ్రవరి 19న అరెస్ట్ చేశారు. అప్పటి నుంచి ఆయనపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ క్రమంలో ఈడీ కస్టడీలోనే తీహార్ జైల్లో ఉన్న కేజ్రీవాల్‌ను అదే కేసులో సీబీఐ అరెస్ట్ చేసింది. కస్టడీ ముగియడంతో ఆయన్ను కోర్టులో హాజరుపర్చారు. మరోవైపు కేజ్రీవాల్ అరెస్ట్‌ను నిరసిస్తూ ఆప్ శ్రేణులు భారీ ఆందోళనలను కొనసాగిస్తున్నాయి.



## కాంగ్రెస్‌లో చేరిన కెకె

ఢిల్లీ: సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు కె కేశవరావు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఏఐసిసి ప్రెసిడెంట్ మల్లికార్జున ఖర్గే నివాసంలో కెకె కాంగ్రెస్ పార్టీలో చేరారు. సిఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కెకెకు ఖర్గే కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి సిఎం రేవంత్ రెడ్డి సమక్షంలో గతంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బిఆర్ఎస్ పార్టీకి కెకె రాజీనామా చేసిన విషయం తెలిసిందే. బిఆర్ఎస్ ఎంఎల్ లలో దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరి, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, సంజయ్‌కుమార్, కాలె యాదయ్య, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, తదితరలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే.



## జూలై 22 నుంచి వర్షాకాల సమావేశాలు..

న్యూఢిల్లీ, జూలై 3, (న్యూస్ పల్స్)కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జూలై 23 లేదా 24న పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈమేరకు కసరత్తు చేస్తున్నారు. అయితే అధికారికంగా తేదీలు ప్రకటించలేదు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాలు జూలై 4న ముగుస్తాయి. ఈ సమావేశాల్లో ఎంపీల ప్రమాణ స్వీకారం, స్పీకర్ ఎన్నిక జరిగాయి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానానికి ఆమోదం తెలుపనున్నారు. తర్వాత సమావేశాలు ముగుస్తాయి.వర్షాకాల పార్లమెంటు సమావేశాలు జూలై 22 నుంచి నిర్వహించాలని కేంద్రం భావిస్తోంది. ఆగస్టు 9వ తేదీ వరకు ఈ సమావేశాలు జరిగే అవకాశం ఉంది. ఈ సమావేశాల్లోనే కేంద్రం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడుతుంది. జూలై 23 లేదా 24 తేదీల్లో బడ్జెట్ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెడతారని తెలుస్తోంది.కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో జూన్ 22న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 53వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఇందులో వస్తు సేవలకు జీఎస్టీ వర్తింపును క్రమబద్ధీకరించడానికి ప్రతిపాదనలపై చర్చించారు. జీఎస్టీ పన్ను రేట్లు, సేవా మినహాయింపులను మెరుగుపరచడానికి అనేక సిఫార్సులు కౌన్సిల్ సూచించింది. రాష్ట్రాల వాటాను ఎప్పటికప్పుడు నిర్మలా సీతారామన్ కూడా ఇందుకు సానుకూలంగా స్పందినట్లు తెలుస్తోంది.ఇదిలా ఉంటే ఈసారి బడ్జెట్‌లో కేటాయింపులు గతంలోకన్నా భిన్నంగా ఉండే అవకాశం ఉందని జెఫరీస్ ఇప్పటికే అంచనా వేస్తోంది.

## దేశంలో బిజెపికి తిరుగులేదు

### మాజీ ఎమ్మెల్సీ రామచంద్రారావు

హైదరాబాద్,జూలై3: ఏ రాష్ట్రంలో అయినా, ఏ పార్టీలో అయినా కుటుంబ పాలన అంతమవుతుందని బిజెపి నేత, మాజీ ఎమ్మెల్సీ రాంచంద్రరావు తెలిపారు. వచ్చే 30 నుంచి 40 ఏళ్ల పాటు బీజేపీనే దేశంలో అధికారంలో ఉంటుందని, ప్రతిపక్షాన్ని ఇప్పటికే ప్రజలు మూలన కూర్చోబెట్టారని విమర్శించారు. కుటుంబ పాలన, రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలపై ప్రజల్లో చర్చ జరుగుతోందని అన్నారు. దేశవ్యాప్తంగా రాజకీయాల్లో కుటుంబ రాజకీయాలు, జాతి, కులమత ప్రాంత వాదాలను నిరోధించాల్సిన అవసరం ఉందని అన్నారు. పనితీరు ఆధారిత పాలన, అభివృద్దితో కూడిన పాలనపైనే బీజేపీ రాజకీయం చేస్తోందని అన్నారు. కాంగ్రెస్‌కు ప్రధాన మంత్రి మోదీ ఫోబియా పట్టుకుందని విమర్శించారు. పార్టీలో ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పాలని కాంగ్రెస్ సభ్యులు పోరాడాలని అన్నారు. సబ్ కే సాత్ సబ్ కా వికాస్ అన్నదే తమ పార్టీ నినాదం అందుకు అనుగుణంగానే నిర్ణయాలుంటాయన్నారు. కుటుంబ పాలన, అవినీతి సర్కార్ ను ప్రజలు క్షమించరని నేతలు అన్నారు. రాష్ట్రంలో ఉద్యమ ఆకాంక్షలు నెరవేరటంలేదన్నారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతిఒక్కరు పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఎప్పటికీ అధికారం తమదేననే భ్రమలో ఉంటున్న కేసీఆర్‌కు ప్రజలు బుద్ధి చెప్పినా మార్పు కానరావడం లేదని విమర్శలు చేశారు. ప్రపంచం మొత్తం మోడీని గొప్పనేతగా కీర్తిస్తుంటే.. బిఆర్ఎస్ నేతలు చిల్లర కామెంట్లు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రభుత్వ భూములు అమ్ముకున్న కేసీఆరే ప్రజలకు అసలైన జవాబుదారీ అని మండిపడ్డారు. దీనిపై ప్రజలకు సంజాయిషీ ఇచ్చుకునే సమయం వచ్చిందని అన్నారు. రాబోయే రోజుల్లో బిఆర్ఎస్‌కు పుట్టగతులు ఉండవని విమర్శించారు.

## కలెక్టర్ విధులకు ఆటంకం

### ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై కేసు నమోదు



కరీంనగర్,జూలై3: హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కరీంనగర్ ఒకటో ఠాణాలో కేసు నమోదైంది. మంగళవారం నిర్వహించిన జిల్లా పరిషత్ సమావేశంలో అధికారుల విధులకు ఆటంకం కలిగించారనే ఫిర్యాదుతో కొత్తగా అమల్లోకి వచ్చిన చట్టం కింద కేసు నమోదు చేశారు. భారత న్యాయ సంహిత సెక్షన్ 122, 126(2) కింద పోలీసులు కేసు ఫైల్ చేశారు. జడ్పీ సమావేశం నుంచి తన ప్రశ్నకు సమాధానం చెప్పకుండా వెళ్తున్నారంటూ కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మంగళవారం అడ్డుకున్నారు. ఆమె వెళ్లే మార్గంలో నేలపై బైఠాయించి నిరసన తెలిపారు. కరీంనగర్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈ ఘటన చోటుచేసుకుంది. జడ్పీ ఛైర్‌పర్సన్ కనుమల్ల విజయ అధ్యక్షతన జరిగిన చివరి సర్వసభ్య సమావేశానికి కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, ఇతర అధికారులు హాజరయ్యారు. జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలతోపాటు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల హుజూరాబాద్ నియోజకవర్గంలో మండల విద్యాధికారులతో ఎమ్మెల్యే హోదాలో తాను విద్యాశాఖ ప్రగతిపై సమీక్ష నిర్వహించానని.. అందులో పాల్గొన్న ఎంఈవోలకు జిల్లా విద్యాధికారి జనార్ధన్‌రావు మెమోలు జారీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమయంలో ఎమ్మెల్యేతోపాటు భారాస జడ్పీటీసీలంతా డీఈవోను సస్పెండ్ చేయాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. దీనిపై కలెక్టర్ సమాధానం చెప్పాలని కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. సభలో ఆందోళన పెరుగుతుండడంతో కలెక్టర్ పమేలా సత్పతి తన కుర్చీలో నుంచి లేచి బయటకు వెళ్లేందుకు ప్రయత్నించగా ఎమ్మెల్యే ఆమె ఎదుట నేలపై బైఠాయించారు. కొద్దిసేపు పోలీసులకు ఆయనకు మధ్య వాగ్వాదం జరిగింది. కలెక్టర్ వెళ్లిన తర్వాత సభలో ఎమ్మెల్యే, కాంగ్రెస్ జడ్పీటీసీ సభ్యులు పరస్పర విమర్శలు చేసుకున్నారు.

## ఎఇఇ సివిల్ ఉద్యోగుల జాబితా విడుదల చేయండి

### టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ మహేందర్ రెడ్డికి కెటిఆర్ ఫోన్

హైదరాబాద్,జూలై3: టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫోన్ చేశారు. ఏఈఈ సివిల్ ఉద్యోగుల నియామకాలకు సంబంధించి ఎంపిక జాబితాను వెంటనే విడుదల చేయాలని ఈ సందర్భంగా కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. కేటీఆర్‌ను నందినగర్‌లోని ఆయన నివాసంలో ఏఈఈ (సివిల్) రాసిన అభ్యర్థులు కలిశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నోటిఫై చేసిన 1180 పోస్టులకు పరీక్షలు జరిగాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పరీక్షకు సంబంధించిన ఎంపిక జాబితాను పెండింగ్‌లో పెట్టింది. ఇదే విషయాన్ని అభ్యర్థులు కేటీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన కేటీఆర్.. విషయానికి సంబంధించి టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డితో మాట్లాడారు. సెలక్షన్ జాబితాను వెంటనే విడుదల చేయాలని ఈ సందర్భంగా కేటీఆర్ కోరారు. ఈ విషయమై కేటీఆర్ ఒక పత్రికా ప్రకటన కూడా విడుదల చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు నిర్వహించిన ఏఈఈ (సివిల్) పరీక్షకు సంబంధించి 1180 పోస్టులకు ఎంపిక జాబితాను ప్రకటించటంలో కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆ ప్రకటనలో ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు తుది జాబితాను విడుదల చేయటం లేదని పేర్కొన్నారు. అభ్యర్థులు తీవ్ర గందరగోళంలో ఉన్నారని, ప్రభుత్వం వెంటనే జాబితా ప్రకటించాలని కేటీఆర్ కోరారు.

# సినిమా తీరు

# స్టార్ రైటర్స్ బ్రేకప్‌కి కారణం?



షోలే.. జంజీర్.. దీవార్.. డాన్.. ఇవన్నీ బాలీవుడ్ లో సంచలన విజయాలు సాధించిన 90ల నాటి క్లాసిక్స్. అయితే వీటన్నిటి సృజన వెనక దాగి ఉన్న రచయితలు సలీం-జావేద్. సల్మాన్ ఖాన్ తండ్రి సలీం ఖాన్.. షబానా ఆజ్మీ భర్త జావేద్ అక్తర్.. హిందీ చిత్రసీమ ఎదుగుదలలో కీలక దశలో భాగస్వాములుగా ఉన్నారు. అద్భుతమైన స్క్రిప్టులను వీరు సృష్టించడమే గాక.. మేటి రచయితలుగా భారీ పారితోషికాలను అందుకున్నారు. అయితే సలీం ఖాన్ - జావేద్ అక్తర్ ఇద్దరూ విడిపోయి ఎవరి దారిలో వారు ప్రయాణించడం పరిశ్రమను ఆశ్చర్యపరిచింది. తాజాగా షబానా అజ్మీని ఓ ఇంటర్వ్యూలో ఆమె భర్త జావేద్ అక్తర్ - సలీం ఖాన్‌ల అనుబంధం గురించి ప్రశ్నించారు.హ్యాట్రిక్ కొట్టేలా సిద్ధమైన హిట్ కాంబో నిజానికి ఈ జోడీ అనుబంధం 1982 వరకు కొనసాగింది. అటుపై ఇద్దరూ విడిపోవాలని నిర్ణయించుకున్నారు. ఆ తర్వాత జావేద్ సాహిత్యం రాయడం ప్రారంభించారు. సలీంఖాన్ స్క్రిప్టు రచయితగానే కొనసాగారు. సలీం-జావేద్‌గా ప్రసిద్ధి చెందిన వీరిద్దరూ పలు బ్లాక్‌బస్టర్ సినిమాలకు స్క్రిప్ట్‌లు రాశారు. వీటిలో షోలే, జంజీర్, దీవార్ , డాన్ సహా ఎన్నో క్లాసిక్స్ ఉన్నాయి. ఐదుసార్లు జాతీయ చలనచిత్ర అవార్డు గెలుచుకున్న సలీం ఖాన్ కుమారుడు, నటుడు అర్బాజ్ ఖాన్ టాక్ షో 'ది ఇన్విన్సిబుల్స్'లో పాల్గొన్న షబానా ఈ అంశాన్ని ప్రస్తావించారు. సలీం-జావేద్ తమ కెరీర్‌లో గరిష్ట స్థాయికి చేరుకున్నారు!

అని అర్బాజ్ తదుపరి ఎపిసోడ్ టీజర్‌లో గుర్తు చేసుకున్నారు. "ఈరోజు వరకు సలీం-జావేద్ ఎందుకు విడిపోయారో నాకు తెలియదు" అని షబానా స్పందించడం ఈ టీజర్ లో కనిపించింది. షబానా అజ్మీ కూడా జావేద్ అక్తర్- సలీం ఖాన్ ల మధ్య పరిష్కారం కోసం ప్రయత్నించడం గురించి ఓపెనైంది. 'అది కష్టం' అని నొక్కి చెప్పింది. ఈ ఎపిసోడ్‌లో షబానా జావేద్ మొదటి భార్య హనీ ఇరానీ .. వారి పిల్లలు ఫర్హాన్ అక్తర్ - జోయా అక్తర్‌లతో తన సంబంధం గురించి కూడా చర్చించారు. దెబ్బ పడినా మళ్ళీ అటువైపే.. ఈ సంవత్సరం ప్రారంభంలో ఓ ఇంటర్వ్యూలో జావేద్ అక్తర్ తన స్నేహితుడు సలీం ఖాన్ నుంచి విడిపోవడం గురించి ప్రస్థావించారు. "మేము కలిసి కెరీర్ ప్రారంభించినప్పుడు.. ఒకరికోసం ఒకరుగా పనిచేసాం. మేము చాలా సమయం కలిసి గడిపాము.. సముద్రం పక్కన కూర్చుంటాము.. కథల గురించి మాట్లాడుకుంటాము. అతను నా గదికి వస్తాడు.. నాకు పేయింగ్ గెస్ట్ రూమ్ ఒకటి ఉంది.. లేదా నేను అతని ఇంటికి వెళ్తాను.. అది చిన్నది. కానీ మేం పెద్దగా మరింత విజయవంతం అయినప్పుడు మా జీవితంలోకి చాలా మంది వ్యక్తులు ప్రవేశించారు. అప్పుడు నిద్రాణంగా ఉన్న కోరికలన్నీ, నిద్రాణమై ఉన్న ఆసక్తులన్నీ... జీవితంలోని ప్రధాన సమస్య లేదా ప్రధాన ఆసక్తిని మేల్కొలుపుతాయి. అవి పూర్తయితేనే మనం సంతృప్తికరమైన స్థితికి చేరుకుంటాం. ఆపై ఇతర ఆసక్తులు ఉద్భవించడం ప్రారంభిస్తాయి" అంటూ నర్మగర్భంగా మాట్లాడారు. తమ మధ్యకు చాలా మంది వ్యక్తులు ప్రవేశించారని జావేద్ స్పష్టంగా చెప్పారు. ఆ తర్వాత తమ స్నేహం బలహీన పడిందని అన్నారు. తాము విడిపోవడానికి డబ్బు, క్రెడిట్‌తో సంబంధం లేదని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. మనం చలారకాల వ్యక్తులను కలుస్తుంటాం. క్రమంగా స్నేహితులు కూడా వేర్వేరు అవుతారు...అదే మా విషయంలోను జరిగింది.. అని జావేద్ అన్నారు. మేము ఒకరితో ఒకరం ఫైటింగులేవీ చేయలేదు.. రచయితలుగా క్రెడిట్ గురించి ఎటువంటి సమస్య లేదు.. డబ్బు గురించి ఎప్పుడూ సమస్య లేదు.. కానీ మేం విడిపోయాము.. అని వెల్లడించారు. నాటి సంబంధం ఇప్పుడు లేదని, మేము ఇప్పుడు సాయంత్రం కలిసి కూర్చోవడం లేదని, మాకు మా స్వంత స్నేహితులు ఉన్నారని అంతా గ్రహించారని అన్నారు. ఇది మా పని పైనా ప్రభావం చూపిందని జావేద్ వివరించారు.

# దిల్ రాజు.. దెబ్బ పడినా మళ్ళీ అటువైపే..

టాలీవుడ్ ప్రముఖ నిర్మాత దిల్ రాజు బాలీవుడ్ లో తన అదృష్టాన్ని పరీక్షించడంలో ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. 'జెర్సీ' మరియు 'హిట్' చిత్రాలు రీమేక్ చేసి నిరాశ పడ్డప్పటికీ, దిల్ రాజు తన ప్రయత్నాలు ఆపడం లేదు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్ నుంచి ముంబై మధ్య తరచుగా ప్రయాణిస్తూ, కొత్త ప్రాజెక్టులు ప్రారంభించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. వచ్చే ఏడాది రెండు భారీ ప్రాజెక్టులు ప్రారంభించాలని దిల్ రాజు చూస్తున్నాడు. అందులో హిందీ ప్రాజెక్టు ఒకటి.వంశీ పైడిపల్లి దర్శకత్వంలోనే ఆ హిందీ సినిమా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఒక వేళ సెట్టయితే వంశీకి ఇదే తొలి హిందీ సినిమా అవుతుంది. ఇక వీరి సినిమాలో షాహిద్ కపూర్ ప్రధాన పాత్రలో నటించే అవకాశాలు ఉన్నాయి. ఈ సినిమా భారీ బడ్జెట్ తో రూపొందనుందని వార్తలు వినిపిస్తున్నాయి. 150 కోట్లకు పైగా ఖర్చు చేయబోతున్నారని టాక్ ఉంది విధంగా ఇది భారీ రిస్క్, ఎందుకంటే షాహిద్ కపూర్ కి ఇటీవల కాలంలో పెద్దగా సక్సెస్ అయితే లేదు. జెర్సీ కనీసం పెట్టుబడిలో సగం కూడా వెనక్కి తీసుకురాలేకపోయింది. ఇక వారసుడు వంటి కమర్షియల్ సినిమాలు చేసిన వంశీ పైడిపల్లితో సినిమా అంటే మాములు విషయం కాదు. అతను ఇప్పటివరకు కమర్షియల్ హిట్‌లు కొట్టాడు కానీ బాలీవుడ్ లాంటి పెద్ద మార్కెట్‌లో తన మార్కు చాటించాలంటే కాస్త సవాలు గానే ఉంటుంది.ఇటువంటి భారీ ప్రాజెక్టులకు ముందుగా స్క్రిప్ట్ ప్లాన్ ను పక్కాగా సరిచూసి తుది నిర్ణయం తీసుకోవాలి. అయితే దిల్ రాజు ఈ రిస్క్ తీసుకోవడంలో జెట్ స్పీడ్ లోనే ధైర్యాన్ని చూపిస్తున్నారు. తన ముంబై పర్యటనల సమయంలో దిల్ రాజు పలువురు ప్రముఖ బాలీవుడ్ నటులను కలిశాడు. ఈ చర్చలు ఇంకా ప్రారంభ దశలో ఉన్నాయని సమాచారం. అలాగే మరికొంత మంది బాలీవుడ్ లో స్టార్ హీరోలు మరియు దర్శకులతో కలిసి పనిచేసే ప్రయత్నంలో దిల్ రాజు ఉన్నాడు.ఈ సంవత్సరం చివరిలో దిల్ రాజు నుండి భారీ ప్రకటనలు వెలువడే అవకాశం ఉంది. బాలీవుడ్ లో తన సత్తా చాటడానికి ఉత్సాహంగా ఉన్న దిల్ రాజు, మంచి కథలు మరియు పెద్ద ప్రాజెక్టులతో ముందుకు రావాలని చూస్తున్నాడు. ఈ ప్రయత్నాలు ఫలితాలనిస్తే, దిల్ రాజు హిందీ చిత్ర పరిశ్రమలో కూడా తన ప్రఖ్యాతిని నిలబెట్టుకుంటాడని ఆశించవచ్చు. మొత్తంగా, టాలీవుడ్ నుండి బాలీవుడ్ వరకు దిల్ రాజు ప్రయాణం ఎంతగా విజయవంతమవుతుందో, ఈ సాహసంతో ఏ స్థాయికి వెళ్తాడో చూడాలి.

# ఆశ్చర్యం కాదు..ఇది నిజం మునగాకు ఆరోగ్యానికే కాదు మీ జుట్టు పెరుగుదలకు కూడా..ఎలా ఉపయోగించాలో తెలుసా?



దేశంలోని ఉష్ణమండల మరియు ఉప-ఉష్ణమండల ప్రాంతాలలో కనిపిస్తుంది. మొరింగ అంటే ఏమిటి?మనలో చాలా మందికి మొరింగ అంటే ఏమిటో తెలియదు. అవును, మన భారతదేశంలోని అనేక పల్లెటూళ్లలో ఎక్కడ చూసినా దొరికే మునగాకు విదేశాల్లో మోరింగగా ప్రసిద్ధి చెందింది. మునాగ చెట్టు మొక్క యొక్క వివిధ భాగాలు ప్రోటీన్, విటమిన్లు, బీటా-కెరోటిన్, అమైనో-యాసిడ్లు మరియు వివిధ ఫినోలిక్‌లకు మంచి మూలాలు. శ్రావణ మాసం ప్రాముఖ్యత, శ్రావణ మొదటి సోమవారం నాడు పూజా విధివిధానాలు.. యాంటీ బ్యాక్టీరియల్‌గా పనిచేస్తుంది పసుపులో పేటరీగోస్పెర్మిన్ ఉంటుంది, ఇది చుండ్రు, దురద స్కాల్ప్, సోరియాసిస్, ఎగ్జిమా మరియు బ్యాక్టీరియల్ బొబ్బలను యాంటీ బాక్టీరియల్ మరియు యాంటీ ఫంగల్‌గా నివారించడంలో సహాయపడుతుంది. జుట్టు కణాల అభివృద్ధి మునగాకులో అమైనో ఆమ్లాలు పుష్కలంగా ఉన్నాయి, ఇది సెల్ బ్లాక్‌లను నిర్మిస్తుంది, కాబట్టి ఇది జుట్టును పునరుజ్జీవింపజేయడంలో, అలోపేసియాను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది నిద్రాణమైన హెయిర్ ఫోలికల్స్‌ని యాక్టివేట్ చేస్తుంది మరియు తద్వారా బట్టతల ప్రాంతాల్లో జుట్టు పెరుగుదలను పెంచుతుంది. భోజనం చేసిన తర్వాత స్నానం ఎందుకు చేయకూడదు? ప్రమాదాలు ఏమిటి? ఇది బయోటిన్ యొక్క గొప్ప మూలం. బయోటిన్ ఖీఃఅల ఉత్పత్తిని పెంచుతుంది. తద్వారా తలకు ఆక్సిజన్ సరఫరా పెరుగుతుంది. ఇది జుట్టు యొక్క టెలోజెన్ దశను ఆలస్యం చేయడం ద్వారా జుట్టు రాలడాన్ని నివారిస్తుంది మరియు జుట్టు కణాల దీర్ఘాయువును పెంచుతుంది. జుట్టు పెరుగుదలను పెంచుతుంది మునగాకులో ఒమేగా 3 యొక్క గొప్ప మూలం. ఇది జుట్టు పెరుగుదలలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. జుట్టుకు దీన్ని ప్యాక్ వేసుకున్నప్పుడు, అందులోని ఒమేగా-3 ఎక్కువగా పూత పూయబడి ఉంటుంది. ఇది హెయిర్ షాఫ్ట్ యొక్క కార్టెక్స్‌లోని రంధ్రాలను మూసివేస్తుంది. తద్వారా జుట్టు పోషణను నిలుపుకోవడంలో సహాయపడుతుంది మరియు తేమను పెంచడంలో సహాయపడుతుంది. ఇవన్నీ జుట్టు పెరుగుదలకు చాలా అవసరం మునగాకులో జింక్, విటమిన్ ఎ మరియు ఐరన్ పుష్కలంగా ఉన్నాయి, ఇవి జుట్టు పెరుగుదలకు చాలా అవసరం. జింక్ స్కాల్ప్‌లోని ఆయిల్ గ్రంధులను ఆరోగ్యంగా మరియు పోషణతో ఉంచుతుంది. ఇది ప్రధానంగా స్కాల్ప్ వాతావరణాన్ని నిర్వహిస్తుంది మరియు జుట్టు పెరుగుదలకు అనుకూలంగా ఉండేలా చేస్తుంది. మోరింగా సోప్ వాడటం వల్ల పద్ధతి దాని ప్రయోజనాలను పెంచడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. శ్రావణ సోమవారం ఇలా చేస్తే.. డబ్బుకు కొదవ ఉండదు, ఆర్థిక సమస్యలన్నీ తొలగిపోతాయి జుట్టుకు మునగాకును ఎలా అప్లై చేయాలి? × కొబ్బరి నూనె, జోజోబా నూనె లేదా ఆముదం కలిపి మునగాకు పొడి మిక్స్ చేసి అప్లై చేయవచ్చు. అరగంట తర్వాత తలస్నానం చేసుకోవాలి. ×మునగాకును హెయిర్ ప్యాక్ లా కూడా అప్లై చేసుకోవచ్చు. మునగాకు పొడిని పెరుగు, రోజ్ వాటర్ మరియు రైస్ వాటర్ వంటి ద్రావకంతో కలపాలి. తలకు పట్టించి అరగంట తర్వాత స్నానం చేయాలి. ×తాజా ఆకులను నీటిలో కాసేపు మరిగించాలి. వేడిని ఆపివేసి, నీటిని చల్లబరచండి. షాంపూ చేసిన తర్వాత, ఈ నీటిని మీ తలపై పోయాలి. కొన్ని నిమిషాలు మసాజ్ చేయండి. తర్వాత 15 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. ఇప్పుడు మీ జుట్టును సాధారణ నీటితో కడగాలి. × కొబ్బరి నూనెతో మునగాకుల పొడిని కలపండి. ఈ నూనెను వేడి చేసి మీ జుట్టుకు పట్టించండి.

# జర జాగ్రత్తగా చూసుకో కన్నప్పా..?

భారీ సినిమా అంటే ఆ సినిమాకు పెద్ద ఎత్తున స్టార్ కాస్ట్.. వందల కోట్ల బడ్జెట్.. భారీ సెట్లు.. అద్భుతమైన గ్రాఫిక్స్.. అదిరిపోయే కాంబినేషన్స్ కాదు.. అసలు భారీ సినిమా అంటే ఆ కాంబినేషన్స్ అన్నిటినీ సెట్ చేసే కథ. ఆ కథ అద్భుతంగా కుదిరితే మిగతావన్నీ దానికి యాడెడ్ అడ్వాంటేజ్ గా మారతాయి. అలా కాకుండా ఏదో రెగ్యులర్ రొటీన్ స్టఫ్ కి ఎంత స్టార్ కలర్ అద్దుదామని చూసినా సరే చేతులకి మరక.. జేబులకి చిల్లులు తప్ప లాభం ఏమి ఉండదు. హ్యాట్రిక్ కొట్టేలా సిద్ధమైన హిట్ కాంబో ఇంతకీ ఈ లీడ్ అంతా దేనికి అంటే రీసెంట్ గా రిలీజైన కల్కి సినిమా ప్రభాస్ ఒక్కడే కాదు అమితాబ్, కమల్, దీపికా ఇలా అందరు తమ తమ పాత్రలకు పూర్తి స్థాయిలో న్యాయం చేయబట్టే ఈ రిజల్ట్ వచ్చింది. అంతేకాదు నాగ్ అశ్విన్ క్రియేటివిటీ తెర మీద ప్రత్యేకంగా కనిపించింది. తాను ఏం తీయాలని అనుకున్నాడో దాన్ని అన్ని విధాలుగా ది బెస్ట్ ఇచ్చే ప్రయత్నం చేశాడు. ఐతే ఈ సినిమా చూశాక రాబోతున్న పాన్ ఇండియా సినిమాల మీద ఈ ఎఫెక్ట్ ఉండేలా ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు. భారీ స్కేల్ లో గ్రాండియర్ గా తీస్తే ఇలాంటి సినిమానే తీయాలి లేకపోతే అసలు ఇలాంటి కథలు టచ్ చేయొద్దు అనుకునేలా నాగ్ అశ్విన్ ప్రూవ్ చేశాడు. ఐతే కల్కి చూసిన తర్వాత త్వరలో రాబోతున్న కన్నప్ప సినిమా గురించి స్పెషల్ గా సోషల్ మీడియాలో చర్చ జరుగుతుంది. మంచు విష్ణు సిన్సియర్ అండ్ సీరియస్ ఎఫర్ట్ గా కన్నప్ప తెరకెక్కిస్తున్నారు. సినిమాలో మంచు విష్ణుతో పాటుగా ప్రభాస్, అక్షయ్ కుమార్, శివ రాజ్ కుమార్, మోహన్ లాల్ ఇలా భారీ తారాగణం మొత్తం ఉంది. దిల్ రాజు.. దెబ్బ పడినా మళ్ళీ అటువైపే.. సినిమాలో వీళ్లంతా ఉన్నా సినిమా టీజర్ తో విమర్శలు అందుకున్నాడు మంచు విష్ణు. కల్కి చూసిన తర్వాత అయినా సరే కన్నప్పలో ఏదైనా మార్పులు చేస్తే బెటర్ అని అనుకుంటున్నారు ఆడియన్స్. అంతేకాదు కల్కి లాంటి విజువల్ వండర్ సినిమా చూశాక దానికి తగిన విజువల్స్ లేదా దాన్ని మించే సినిమా ఐతే ఓకే కానీ అంచనాలను ఏమాత్రం అందుకోకపోయినా సరే నెటిజన్ల ట్రోల్స్ కి సిద్ధం కాక తప్పదు. మరి మంచు విష్ణు కన్నప్పని ఏం చేస్తున్నాడన్నది చూడాలి. సినిమా ఎలాగు పూర్తి కాలేదు కాబట్టి ఇప్పటినుంచి జాగ్రత్త పడితే బెటర్ అనుకుంటున్నారు.

## అందానికే మరో అందం....



# పూజా.. ఇది మరీ టూమచ్ అబ్బా..!

బుట్ట బొమ్మ పూజా హెగ్డే టాలీవుడ్ పై బెట్టు చేస్తున్నట్టుగా వార్తలు వస్తున్నాయి. ఇన్నాళ్లు ఇక్కడ స్టార్ హీరోయిన్ గా సూపర్ ఫాం కొనసాగించిన అమ్మడు ఒక్కసారిగా సినిమాలు లేక డీలా పడిపోయింది. స్టార్ హీరోలంతా కాదు కాదు స్టార్ డైరెక్టర్స్ అంతా అదేదో ఆమె మీద పగ పట్టినట్టుగా ఆమెను ఎంపిక చేయట్లేదు. మొన్నటిదాకా ఆహా ఓహో అన్న వాళ్లు కాస్త ఇప్పుడు ఆమె కాకుండా వేరే ఆప్షన్ కి వెళ్తున్నారు. తెలుగు నుంచి కచ్చితంగా ఆఫర్స్ వస్తాయని



ఇన్నాళ్లు ఎదురుచూసిన పూజాకి ఇక్కడ ఆఫర్లు కష్టమే అన్న మైండ్ సెట్ కి వచ్చింది. ఈ క్రమంలో తన దాకా వచ్చిన స్పెషల్ సాంగ్ ఆఫర్ ని కాదన్నదని టాక్. రాక రాక వచ్చిన అవకాశం కాస్త అమ్మడు నో నాట్ ఓకే అనేసరికి అది కూడా వెళ్లిపోయింది. రాధే శ్యాం తర్వాత పూజా టాలీవుడ్ ఫేట్ మారిపోయింది. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ తో సినిమా ఆ సినిమా తర్వాత పూజా ని అందుకోవడం కష్టమని భావించారు. కానీ సీన్ రివర్స్ అయ్యింది. ఆ సినిమా తర్వాత అమ్మడికి సరైన ఛాన్సులు రాకుండా పోయాయి. మహేష్ గుంటూరు కారం సినిమాలో అమ్మడు చేయాల్సి ఉన్నా సినిమాకు ఇచ్చిన డేట్స్ లో పూర్తి చేయలేకపోయారు. ఇంకా ఎక్కువ డేట్స్ అడిగితే వేరే సినిమాకు కమిట్ మెంట్ ఇవ్వడం వల్ల ఆ ప్రాజెక్ట్ నుంచి ఎగ్జిట్ అవ్వాల్సి వచ్చింది. ఆ తర్వాత పూజా పేరు కూడా టాలీవుడ్ లో వినిపించలేదు. అట్లీ, అల్లు అర్జున్ సినిమాలో పూజా హెగ్డే హీరోయిన్ గా ఫిక్స్ అని అనుకుంటే ఆ సినిమానే పక్కన పెట్టేశారు. దిల్ రాజు.. దెబ్బ పడినా మళ్ళీ అటువైపే.. నాగ చైతన్య కార్తీక్ దండు కాంబో సినిమాలో పూజా పేరు వినిపిస్తుంది. ఒకవేళ ఆ ఛాన్స్ కూడా మిస్ అయితే మాత్రం అమ్మడిని తెలుగు ఆడియన్స్ మర్చిపోయే ఛాన్స్ ఉంటుంది. మొన్నటిదాకా తన థై షోతో యూత్ ఆడియన్స్ ని అలరించిన పూజా హెగ్డే ఇప్పుడు ఎంత రెచ్చిపోదామని అనుకుంటున్నా ఆఫర్లు మాత్రం రావట్లేదు. ఐతే టాలీవుడ్ ఛాన్స్ ఇవ్వకపోయినా తమిళ్ లో సూర్య హీరోగా ఒక ప్రాజెక్ట్ ఓకే చేసింది పూజా హెగ్డే. ఆ సినిమాతో అయినా అమ్మడు మళ్లీ సౌత్ లో ఫాం లోకి వస్తుందేమో చూడాలి.

# ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్.. ప్రపంచ నెంబర్ వన్ ఆల్‌రౌండర్‌గా హార్దిక్ పాండ్యా



ఐసీసీ తాజాగా టీ20 ర్యాంకింగ్స్‌ను బుధవారం విడుదల చేసింది. టీమిండియా టీ20 వైస్ కెప్టెన్ హార్దిక్ ప్యాండ్యా ప్రపంచ నెంబర్ వన్ ఆల్‌రౌండర్‌గా నిలిచాడు. శ్రీలంకు చెందిన వనిందు హసరంగను అధిగమించి నెంబర్ వన్ స్థానానికి చేరాడు. టీ20 వరల్డ్ కప్‌లో అద్భుతమైన ఆటతీరును కనబరిచిన పాండ్యా.. రెండు స్థానాలు మెరుగుపరుచుకొని 222 పాయింట్లతో హసరంగతో సమానంగా నిలిచాడు. వరల్డ్ కప్‌లో ఆటు బ్యాట్‌తో, ఇటు బాల్‌తో మెరుగైన ప్రదర్శన చేశాడు. లోయర్ ఆర్డర్‌లో బ్యాట్‌తో ఆకట్టుకోగా.. అదే సమయంలో జట్టుకు అవసరమైన సమయంలో బంతితోనూ మ్యాజిక్ చేశాడు. 150 కంటే ఎక్కువ స్ట్రయిక్ రేట్‌తో 144 పరుగులు చేయడంతో పాటు 11 వికెట్ల తీశాడు. కీలమైన ఫైనల్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా బ్యాటర్లు క్లాసెన్, డేవిడ్ మిల్లర్‌తో పాటు రబాడా వికెట్లు తీసి మ్యాచ్ ఐసీసీ టీ20 వరల్డ్ కప్ టైటిల్‌ను నెగ్గేందుకు సహకారం అందించాడు.ఆల్‌రౌండర్ ర్యాంకింగ్స్‌లో టాప్ టెన్‌లో హసరంగ, మార్కస్ స్టోయినిస్, సికందర్ రజా, షకీబ్ అల్ హసన్, మహ్మద్ నబీ, దీపేంద్ర సింగ్, లియామ్ లివింగ్‌స్టోన్, ఐడెన్ మార్క్‌రమ్, మోయిన్ అలీ ఉన్నారు. ఇక టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో ఆదిల్ రషీద్ మొదటి స్థానంలో ఉన్నాడు. అన్రిచ్ నొర్ట్జే రెండో స్థానానికి చేరుకున్నాడు. ఏడు స్థానాలు మెరుగుపరుచుకొని రెండోస్థానానికి ఎగబాగాడు. ఇక ప్రపంచకప్‌లో 15 వికెట్లతో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డును గెలుచుకున్న టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా 12 స్థానాలు మెరుగుపరుచుకొని 12వ స్థానానికి చేరుకున్నాడు. టాప్-10 బౌలర్లలో అక్షర్‌పటేల్, కుల్దీప్ యాదవ్ చోటు సంపాదించారు. టీ20 ప్రపంచకప్‌లో మెరుగైన ప్రదర్శన చేసిన అర్షదీప్ సింగ్ 13వ స్థానానికి చేరాడు. ఇక శ్రీలంక బౌలర్ హసరంగ రెండో స్థానంలో ఉండగా.. ఆఫ్ఘన్ ఆల్ రౌండర్ రషీద్ ఖాన్ మూడోస్థానంలో ఉన్నాడు.

# ఎట్టకేలకు బార్బడోస్‌ను వీడిన టీమ్ఇండియా.. ప్రత్యేక ఫ్లైట్‌లో భారత్‌కు పయనం

బెరిల్ హరికేన్ ముప్పుతో ద్వీప దేశం బార్బడోస్ లో చిక్కుకుపోయిన భారత క్రికెట్ జట్టు ( ఎట్టకేలకు స్వదేశానికి బయల్దేరింది. బీసీసీఐ ఏర్పాటు చేసిన ప్రత్యేక విమానంలో రోహిత్ సేత భారత్‌కు పయనమైంది. వీరు గురువారం ఉదయానికి ఢిల్లీ చేరుకోనున్నట్లు తెలుస్తోంది. బీసీసీఐ కార్యదర్శి జై షా సహా టీమ్ఇండియా క్రికెటర్లు, వారి కుటుంబ సభ్యులు, సహాయక సిబ్బంది, బీసీసీఐ ప్రతినిధి బృందం, స్పోర్ట్స్ జర్నలిస్టులు అంతా కలిపి 70 మంది వరకు ఉన్నట్లు అంచనా. వీరంతా బార్బడోస్‌ను వీడి.. బీసీసీఐ ఏర్పాటు చేసిన ప్రత్యేక విమానంలో స్వదేశానికి పయనమయ్యారు.కాగా, వెస్టిండీస్‌లోని బ్రిడ్జ్‌టౌన్‌లో గత నెల 29న శనివారం దక్షిణాఫ్రికాతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత్ ఘన విజయం సాధించింది. చివరి ఓవర్ వరకూ నరాలుతెగే ఉత్కంఠతో హోరాహోరీగా సాగిన ఫైనల్ పోరులో భారత్ 7 పరుగుల తేడాతో సఫారీలను మట్టికరిపించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 176 పరుగులు చేసింది. పొట్టి ఫార్మాట్ ఫైనల్ మ్యాచ్‌లో ఇంతవరకు ఇదే అత్యధిక స్కోరు. ఆ తరువాత బ్యాటింగ్‌కు దిగిన సఫారీలు 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 169 పరుగులు మాత్రమే చేయగలిగారు. దీంతో 17 ఏండ్ల (2007) తర్వాత టీ20 వరల్డ్ కప్‌ను భారత్ ముద్దాడింది.ఇక మ్యాచ్ అనంతరం జులై 1న వారు అక్కడి నుంచి బయల్దేరి రావాల్సి ఉంది. అయితే, బెరిల్ తుఫాన్ కారణంగా అక్కడ చిక్కుకుపోయారు. ముందుగా వారు జులై 2న అంటే మంగళవారం సాయంత్రం 6 గంటలకు (స్థానిక కాలమానం ప్రకారం) అక్కడి నుంచి బయల్దేరి బుధవారం రాత్రి 7:45 గంటలకు ఢిల్లీ చేరుకుంటారని వార్తలు వచ్చాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY BYAGAL SRINIVAS, PRINTED AT S.S. PRINTERS & FILE MAKERS, PUS ALAGALLY, JAWAHAR ROAD, Town & Dist.NIZAMABAD- 503001, TELANGANA STATE, PUBLISHED AT H.NO: 6-11-174/1, NAMDEVWADA, Town & Dist. NIZAMABAD, TELANGANA STATE - 503001.EDITOR: BYAGAL SRINIVAS.